

శ్రీవారి సేవకు మళ్లీ సింఘాల్ | జీఏడీకి శ్యామలరావు

గతంలో పని చేసింది: 2017 మే 6 నుంచి 2020 అక్టోబరు 4వ తేది వరకు.

టీటీడీ ఈవోగా మరోసారి అనిల్‌కుమార్ సింఘాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన టీడీపీ ప్రభుత్వంలో ఈవోగా నియమితులైనప్పటికీ వైసీపీ ప్రభుత్వంలోనూ ఏడాది పాటు ఈవోగా కొనసాగారు. మొత్తమ్మీద మూడున్నరేళ్ల పాటు ఈవోగా పనిచేశారు. 'నార్త్‌ఇండియన్‌గా ఉన్న సింఘాల్‌కు ఇక్కడ ఆచారాలు ఏం తెలుసు, ఎలా పనిచేస్తారు, ఏపీలో ఐఏఎస్ అధికారులు ఎవరూ లేరా' అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చినప్పటికీ ఆయన్ను ఈవోగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నాటి ప్రభుత్వం మార్చలేదు. అప్పటి సీఎం చంద్రబాబు పెట్టుకున్న నమ్మకానికి తగ్గట్టు టీటీడీ ఈవోగా మూడేళ్ల ఐదు నెలల పాటు పనిచేసిన సింఘాల్ అనేక సంస్కరణలు తీసుకొచ్చి అందరి ప్రశంసలు అందుకున్నారు.

సర్వదర్శన భక్తులకు స్లాటెడ్ టోకెన్లు

సామాన్య భక్తులూ అతితక్కువ సమయంలోనే శ్రీవారిని దర్శించుకోవాలనే తపనతో స్లాటెడ్ సర్వదర్శన (ఎస్ఎస్‌డీ) విధానాన్ని ప్రవేశపెట్టింది సింఘాలే. నేటికీ ఈ విధానం విజయవంతంగా సాగుతోంది. అలాగే గరుడవారధి ప్రారంభమైంది కూడా సింఘాల్ ఆధ్వర్యంలోనే. టీటీడీలో ఈ ఫైలింగ్ విధానానికీ శ్రీకారం చుట్టారు. ఆలయంలోని పురాతన మండపాలను ప్రతిఒక్కరు వీక్షించేలా మండపాలకు ఉన్న ఇత్తడి గ్రిల్స్‌ను తొలగించారు. కంపార్టుమెంట్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ రోడ్లపైకి వచ్చేది. దీనికి పరిష్కారంగా నారాయణగిరి పార్కులో సింఘాల్ ఆదేశాల మేరకు తొమ్మిది షెడ్లను నిర్మించారు. దీంతో ఎన్నో సౌకర్యాలతో కూడిన షెడ్లలో భక్తులు తమ సమయం వచ్చేవరకు వేచిఉంటున్నారు. ధ్వజస్తంభం వద్ద మూవింగ్ రూఫ్ నిర్మించారు. ముఖ్యంగా వివిధ ప్రాంతాల్లో ఆలయాల పరిరక్షణ, నూతన ఆలయాల నిర్మాణం, ఆధునికీకరణ వంటి వాటికోసం శ్రీవాణి ట్రస్టును ప్రారంభించారు.

ఇక, ప్రైవేట్ బ్యాంకుల్లో బంగారు, నగదు డిపాజిట్లు, శ్రీవారి ఆలయంలో ఇనుప వంతెన నిర్మాణం వంటి అతి తక్కువ విషయాల్లో మాత్రం సింఘాల్ విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీ ఈవో బదిలీ

తిరుమల-తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారి శ్యామలరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అనిల్ కుమార్ సింఘాల్ మళ్లీ ఈవోగా నియమితులయ్యారు. గతంలో మూడున్నరేళ్ల పాటు ఈయన టీటీడీ ఈవోగా పనిచేశారు. ప్రస్తుత ఈవో శ్యామలరావును జీఏడీ (పొలిటికల్)లో కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

టీటీడీ ఈవోగా పనిచేసింది: గతేడాది జూన్ 16వ తేది నుంచి ప్రస్తుతం బదిలీ అయ్యే వరకు.

సీఎం చంద్రబాబు ఏరికోరి టీటీడీ ఈవోగా తెచ్చుకున్న జె.శ్యామలరావు 15 నెలలకే బదిలీ కావడం టీటీడీ వర్గాల్లో విస్మయాన్ని రేకెత్తిస్తోంది. జీఏడీ (పొలిటికల్)లో కార్యదర్శిగా ఆయన్ను నియమిస్తూ సోమవారం బదిలీ ఉత్తర్వులు వచ్చా యి. చంద్రబాబు సీఎం హోదాలో తొలిసారి తిరుమలకు రాకముందే.. అప్పటికి ఇన్‌చార్జి ఈవోగా ఉన్న ధర్మారెడ్డిని ప్రభుత్వం ఆగమేఘాలపై తప్పించి శ్యామలరావును నియమించింది. ఆ తర్వాతే సీఎం హోదాలో చంద్రబాబు తిరుమల వెళ్లారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను ప్రక్షాళన చేస్తానని, ఆ ప్రక్రియ టీటీడీ నుంచే ప్రారంభిస్తానని ఆ సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు. అయితే, టీటీడీ పరిపాలనలో సీఎం ఆలోచనలు, అంచనాలకు అనుగుణంగా పనిచేయడంలో శ్యామలరావు వెనకబడటంతో బదిలీ జరిగిందన్న ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది జనవరిలో తిరుపతి బైరాగిపట్టెడలోని వైకుంఠ ద్వారదర్శన టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందగా, 40 మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఆ ఘటనతో సీఎం చంద్రబాబు టీటీడీ అధికార యంత్రాంగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి నుంచే ఆయనలో టీటీడీ ఈవో పట్ల అసంతృప్తి మొదలైనట్టు సమాచారం. దానికి తోడు పలు ఇతర కారణాలూ తోడయ్యాయని టీటీడీ, రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

కొన్ని అంశాల్లో తనదైన ముద్ర

టీటీడీ ఈవోగా పనితీరులో పాలకమండలి నుంచి అసంతృప్తిని, ఆరోపణలను ఎదుర్కొన్న ఈవో శ్యామలరావు.. కొన్ని అంశాల్లో టీటీడీ పాలనపై తనదైన ముద్ర వేశారు. ఈవోగా బాధ్యతలు తీసుకున్న వెంటనే శ్రీవారి ప్రసాదాలకు వినియోగించే నెయ్యి నాణ్యతను అనుమానించి నమూనాలను ల్యాబ్‌కు పంపడం ద్వారా కల్తీ జరిగిందని గుర్తించారు. దాంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగిన వ్యవహారాలపై ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తుల్లో ఆవేదన, ఆగ్రహం పెల్లుబికాయి. శ్రీవారి ప్రసాదాలకు పూర్వపు రుచి, నాణ్యత తెప్పిండానికి కృషి చేసి సఫలీకృతులయ్యారు. సేంద్రియ ఉత్పత్తుల ఖరీదు ఎక్కువన్న సాకుతో ఆలయంలో అన్న ప్రసాదాలను గత ప్రభుత్వ హయాంలో కేవలం 5-6 వేల మందికి మాత్రమే అందించే వారు. ఆ ప్రసాదాల రుచి తగ్గడంతో భక్తుల నుంచీ విమర్శలు పెరిగాయి. దీనిపై దృష్టి పెట్టిన శ్యామలరావు సేంద్రియ పంట ఉత్పత్తుల స్థానంలో సాధారణ పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి వాడడం ద్వారా మునుపటి రుచిని తెప్పించారు. ఆలయంలో 20 వేల మంది భక్తులను వాటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. నిత్యాన్నదాన సత్రంలో కూడా నాణ్యతపై దృష్టి పెట్టారు. సరైన ముడిసరుకులు కొనడం లేదని గుర్తించారు. రిలయన్స్ మార్కెటింగ్ నిపుణుల సాయం తీసుకున్నారు. నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి సూచనలు తీసుకుని పాటించారు. దీంతో నిత్యాన్నదాన సత్రంలో కూడా అన్నప్రసాదాల రుచి, నాణ్యత పెరిగాయి. శ్రీవారి సేవ విభాగంలో కూడా భక్తులకు మెరుగైన సేవలందించేందుకు శ్రీవారి సేవకులకు శిక్షణ ఇప్పించేలా సంస్కరణలు తెచ్చారు. శ్రీవారి మాడవీధుల్లో భక్తులకు గోవింద నామాలు నుదుట పెట్టడం, ఐటీ విభాగంలో చాలా లోపాలను అరికట్టారు.

ఆ నిర్ణయాలపై..

వైసీపీ హయాంలో అడ్డదిడ్డంగా జరిగిన నియామకాలను రద్దు చేయడంలో శ్యామలరావు చురుగ్గా వ్యవహరించలేదని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఉదాహరణకు గత ప్రభుత్వంలో నిబంధనలు పాటించకుండా అర్హత లేని వ్యక్తిని ఏకంగా ఐటీ విభాగం జీఎంగా నియమించిన సంగతి తెలిసిందే. అతడిని ఈవో శ్యామలరావు ఐటీ జీఎం పోస్టు నుంచి తప్పించి మరో విభాగానికి బదిలీ చేశారు. నియామకమే అక్రమమైనప్పుడు తొలగించకుండా, కోర్టు కేసులు వస్తాయన్న సాకుతో విభాగం మార్చడం విమర్శలకు దారి తీసింది. అదే పోస్టులో గతంలో ఉండి వైసీపీ ముద్ర వేసుకున్న ఓ అధికారికి తిరిగి ఐటీ విభాగం జీఎం పోస్టు కట్టబెట్టారని బోర్డు అసంతృప్తి వ్యక్తం చేసి.. తొలగించాలని నిర్ణయం తీసుకుంది. దీనినీ చాలా ఆలస్యంగా అమలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఇక, టీటీడీ బోర్డుతో సమన్వయ లోపం ఉన్నట్లు కొన్ని నెలలుగా ప్రచారంలో ఉంది. దీనిపై సీఎంకూ ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఇక, తాము తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో ఈవో తీవ్ర తాత్సారం చేస్తున్నారంటూ సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. దర్శనాల విషయంలో ఏఐ వినియోగం, అలిపిరి పాదాల మండపాన్ని రూ.8 కోట్లతో పునరుద్ధరించేందుకు ఓ దాత ముందుకు రాగా సకాలంలో స్పందించలేదని, టీటీడీ విద్యాసంస్థల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న లెక్చరర్లు, డ్రైవర్లను రెగ్యులర్ చేసేందుకు బోర్డు తీర్మానించినా అమలు ఆలస్యమయ్యేలా వ్యవహరించారని సభ్యులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి


కూలీని ఉద్యోగిని చేశారు



'కూలి పనిచేస్తే కానీ పూట గడవదు. అలాంటి నన్ను మ్యాపింగ్‌లో సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగిని చేశారు. దీంతో మా పిల్లలకు తల్లికి వందనం రాలేదు. రేషన్‌కార్డు పోయింది. ప్రభుత్వ పథకాలు ఏవీ అందటంలేదు' అంటూ తిరుపతికి చెందిన శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తంచేశారు. ఈయనలా ఎందరో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని తమ సమస్యలపై పీజీఆర్ఎస్‌లో వినతులిచ్చారు. అధికారులకు 238 అర్జీలు రాగా, అందులో 150 భూ సమస్యలకు సంబంధించినవే.

8

ఆలయ శుద్ధి అనంతరం భక్తులకు దర్శనం



సోమవారం వేకువన ఆలయ తలుపులు తెరుస్తున్న అర్చకులు, అధికారులు

తిరుచానూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం నేపథ్యంలో తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారి ఆలయాన్ని టీటీడీ అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. సోమవారం వేకువ జామున గ్రహణం ముగిసిన తర్వాత ఆలయ ద్వారాలు తెరిచి శుద్ధి అనంతరం అర్చకులు అమ్మవారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులకు దర్శనం కల్పించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో తొమ్మిది మందికి జైలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో తొమ్మిది మందికి జైలు శిక్ష విధిస్తూ నాలుగో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి తెలిపిన ప్రకారం.. తిరుపతిలోని దాదాపు 10 కూడళ్లలో పది రోజులుగా ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ అనలైజర్ల ద్వారా తనిఖీలు చేపట్టారు. మద్యంతాగి వాహనాలను నడుపుతూ, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. వీరిలో 22 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున రూ.2.20 లక్షల జరిమానా విధించారు. ఇందులో ఎక్కువ మోతాదులో మద్యం తాగడం, మళ్లీ మళ్లీ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్న వారిలో ఒకరికి నాలుగు రోజులు, మరో ఇద్దరికి రెండు రోజులు, ఆరుగురికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆరుగురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

● 36 దుంగలు, లగేజీ వ్యాను, కారు, బైక్ స్వాధీనం

మంగళం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ అలిపిరి- చెర్లోపల్లె మార్గంలోని అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఆరుగురు ఎర్రచందనం స్మగర్లను అరెస్టు చేశారు. 36 దుంగలు, ఐదు వేర్లను, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం అటవీ సిబ్బంది చైతన్య, కిషోర్‌తో కలిసి అలిపిరి నుంచి చెర్లోపల్లి వైపుగా కూంబింగ్ నిర్వహించారు. అరవింద్ ఐ ఆస్పత్రి సమీపంలో అటవీ ప్రాంతంలో కొన్ని వాహనాలు ఉండటాన్ని గమనించారు. సమీపించడంతో కొంతమంది పారిపోవడానికి ప్రయత్నించారు. వెంబడించి ఆరుగురిని పట్టుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా 27 ఎర్రచందనం దుంగలు లభించాయి. పరిసరాల్లో మరో 9 దుంగలు, ఐదు వేర్లు కనిపించగా స్వాధీనం చేసుకున్నారు. లగేజి వాహనం, కారు, మోటార్ సైకిల్‌ను సీజ్ చేశారు. పట్టుబడ్డ వారిలో ముగ్గురు కర్ణాటక, ముగ్గురు అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. వాహనాలతో సహా పట్టుబడ్డ ఎర్రచందనం విలువ రూ.60లక్షలు ఉంటుందని టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

జిల్లాకు మూడు పోలీసు జాగిలాలు

● నార్కోటిక్, గంజాలో శిక్షణ పొందిన వాటిని కేటాయించిన అధికారులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి, నార్కోటిక్‌లో శిక్షణ పొందిన మూడు జాగిలాలను తిరుపతి పోలీసు జిల్లాకు అధికారులు కేటాయించారు. ఇవి బెల్జియన్ మలినోయిస్ జాతి కుక్కలు. రాష్ట్రంలోనే తొలిసారిగా డ్యూయల్ శిక్షణ పొందిన జాగిలాలు రావడం తొలిసారి. ఏపీ ఇంటెలిజెన్సు అదనపు డీజీపీ ఆదేశాల మేరకు తిరుపతి పోలీసు జిల్లాకు జోనా, వేగా, సిరి పేర్లున్న జాగిలాలు కేటాయించారు. ప్రతి జాగిలం దాదాపు 10 నెలల పాటు డ్యూయల్ ట్రైనింగ్, నార్కోటిక్, గంజా ట్రాకింగ్‌లలో శిక్షణ పొందింది. ఈ మూడు జాగిలాలను వాటి నిర్వాహకులైన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జనందకుమార్, ఏఆర్ పీసీ తిమ్మయ్య, రావీన్ వర్మ, రెడ్డి ప్రకాష్, శ్రీనివాసులు సోమవారం ఎస్పీ హర్షవర్ధనరాజు వద్దకు తీసుకొచ్చారు. అవి ఎస్పీకి సెల్యూట్ చేయడం ద్వారా రిపోర్టు చేశాయి. అనంతరం వాటి ప్రత్యేకతల గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ మూడు జాగిలాలను తిరుమల బ్రహ్మోత్సవాలకు వినియోగించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎంటీవో రాజశేఖర్, ఎస్బీ సీఐ సాధిక్ ఆలి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ వద్ద రిపోర్టు చేసుకుంటున్న జాగిలాలు

వైసీపీ పాలనలో 'అమృత్' అధోగతి

● 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ దినకర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాల కారణంగా తిరుపతి కార్పొరేషన్‌లో అమృత్ పథకం ఇప్పటికీ పూర్తి కాలేదని 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. కేటాయించిన నిధుల మేరకు పనులు పూర్తికాకపోవడం దారుణమన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో 20 సూత్రాల కార్యక్రమాల అమలుపై ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. తిరుపతికి ప్రస్తుతం అమృత్ 2.0కింద మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగరంలో 1.58 గృహాలకు గాను ఇప్పటికీ 35శాతం ఇళ్లకు నీటి కుళాయిలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ సంక్షేమపథకాలపై ఆయన సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. సమగ్ర శిక్షణ, ఎన్టీఆర్ వైద్య సేవ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతిలో పార్లమెంటు ఉప ఎన్నికలో దొంగ ఓట్లు, కొరమేనుగుంట తదితర ప్రాంతాల్లో కబ్జా అంశాలపై ఆరాతీశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు(డబుల్ ఇంజన్ సర్కార్) కృషి చేస్తున్నాయన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో దిగజారిన ఆర్థిక పరిస్థితిని సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. రూ.7,417కోట్లతో కండలేరు నుంచి, రూ.2,800 కోట్లతో గండికోట నుంచి జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని కుళాయిల ద్వారా అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, జేసీ శుభం బన్సల్, నగర పాలకసంస్థ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్

ఉపాధ్యాయులకు సన్మానం



పాకాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయదినోత్సవం జరుపుకొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సుమతమ్మ ఆధ్వర్యంలో ఎంఈవోలు బాట్జీ, లింగయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు రామయ్య తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మెన్ రమేష్, ఉపాధ్యాయులు సీఆర్‌పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు



పీజీఆర్ఎస్‌పై సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దారు

రామచంద్రాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోవలని తహసీల్దారు మధుసూదన్‌రావు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తమ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే సంబంధిత వీఆర్వోలపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు, అసిస్టెంట్లు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. ప్రజలు ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించి యంత్రాలతో చదును చేసే ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం క్రిమినల్‌కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజల అర్జీల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వీఆర్వోలు, సిబ్బంది వంశీకృష్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పట్టాలున్నాయి.. న్యాయం చేయండి..!



ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

తిరుపతిరూరల్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీలో తమ ఇళ్ల స్థలాలకు న్యాయం చేయాలని పలువురు గ్రామస్తులు కోరారు. సోమవారం వారు రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 14మందికి 1991లో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఆర్థికస్థోమత లేక గుడిసెలు వేసుకున్నామన్నారు. కాలక్రమంలో గుడిసెలు కూలిపోయాయన్నారు. గత ప్రభుత్వంలో నిర్మాణాలను చేపడుతుంటే స్థానిక వైసీపీ నేతలతో కొందరు కలసి అధికారబలంతో అడ్డుకున్నారన్నారు. ఇప్పుడు ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతుంటే కొందరు తమకు దోబీఘాట్‌కి ఆస్థలాన్ని కేటాయించారంటున్నారని వాపోయారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని కోరారు. మరోపక్క సర్వేనంబరు 214లో తమరప కేటాయించిన దోబీఘాట్ స్థలాన్ని కాపాడాలని పలువురు రజకులు తహసీల్దార్‌కి వినతి సమర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ ఆ స్థలం కాలువపోరంబోకుగా నమోదై ఉందన్నారు. సమగ్రంగా విచారణ జరుపుతామన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎంనేతల ధర్నా

దోబీఘాట్ స్థలంలో ఆక్రమణదారులను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. సోమవారం ఆపార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రామ్మోహన్‌కి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి సుమన్, చిన్నబాబు, బాలవిజయ్, రజకసంఘ నేతలు వినతిపత్రం సమర్పించారు.

సామాజిక సమస్యలపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్శిటీ సామాజిక శాస్త్ర విభాగం పీజీ విద్యార్థులు ఆర్సీపురంలో సోమవారం సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి రామచంద్రాపురం ఎస్టీకాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీవీపురం, గంగిరెడ్డిపల్లి, రామచంద్రాపురం ఎస్సీకాలనీగంగమాంబపురం, కమ్మకండ్రిగ, మిట్టూరు, సిరామాపురం గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై ప్రజలు, రైతులు నుంచి అభిప్రాయాలు సేకరించారు. ప్రిన్సిపాల్ సుకన్య ప్రొఫెసర్ డాక్టర్ జానకిరామయ్య పాల్గొన్నారు.

ఎరువులు సకాలంలో అందించాలని సీపీఐ నిరసన



చంద్రగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. మండల సీపీఐ కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ భీమవరం, ఎం.కొంగరవారిపల్లి, గంగిరెడ్డిపల్లి, బొప్పరాజుపల్లి, శానంబట్ల, కొటాల, ఐయితేపల్లి, తదితర గ్రామాలలో ఎరువులు సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎరువులు ఇవ్వకపోతే పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఫై రాజా, పార్వతి, గీత, కళావతి, బాలకృష్ణ, ఫయాజ్, నారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

సంప్రోక్షణ తరువాత తెరుచుకున్న ఆలయాలు

చంద్రగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మూత పడిన ఆలయాలు సోమవారం ఉదయం తెరుచుకున్నాయి. శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంతో పాటు, తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున అగస్త్యేశ్వరాలయం, చంద్రగిరి కోదండరామాలయం, మూలస్థాన ఎల్లమ్మ, మల్లేశ్వరాలయం, తదితర ఆలయాల్లో సంప్రోక్షణ చేసి దర్శనం కల్పించారు. దీంతో మళ్లీ ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

కనులపండువగా రథోత్సవం



చిట్టమూరు, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాంలో జరుగుతున్న శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవం కనుల పండువగా సాగింది. శ్రీవళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు రథాన్ని లాగి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మిరి యాలు, ఉప్పు రథంపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రథం ముందు పొలి టెంకాయలు కొట్టారు. రథోత్సవానికి భక్తులు భారీసంఖ్యలో రావడంతో గూడూరు డీఎస్పీ గీతా కుమారి, వాకాడు సీఐ హుస్సేన్ భాషా, చిట్టమూరు, వాకాడు, కోట ఎస్ఐలు చిన్న బల రామయ్య, నాగబాబు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు.

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చలివేంద్రం వద్ద మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఓజిలి మండలం పాపిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వినోద్ మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుం డగా చలివేంద్రం వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

చంద్రగిరి

పాముకాటుతో మహిళ మృతి



మంగమ్మ (ఫైల్ ఫొటో)

కేవీబీపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిద్దికండ్రిగకు చెందిన మంగమ్మ(44) సోమవారం పాముకాటుతో మృతి చెందింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు... మిద్దికండ్రిగకు చెందిన మంగమ్మ సోమవారం ఉదయం సజ్జపంట కోతకు వెళ్లింది. కంకులు కోస్తుండగా పొలంలో ఆమెను పాము కాటేసింది. సహచర కూలీలు ఆమెను ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తి ప్రభుత్వఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. దీంతో ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి పంపించారు.

మృత్యుంజయుడికి పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గుండెపోటుతో బీజేపీ నాయకుడి మృతి



వెంకటయ్య (ఫైల్ ఫొటో)

కేవీబీపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వెంకటయ్య(59) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తిరుపతి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, పార్టీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్ కాళంగికి చేరుకుని బీజేపీ జెండాను ఆయనపై కప్పి నివాళుల ర్పించారు. కూటమి నాయకులు రామాంజులు నాయుడు, గోపీనాథ రెడ్డి, సురేష్‌రెడ్డి, మునిశేఖర్‌యాదవ్, మునిసుబ్రహ్మణ్యం తదితరులు నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఘనంగా ఫిజియోథెరపీ డే



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్లు

రేణిగుంట సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్సల అనంతరం ఫిజియోథెరపీ ప్రాధాన్యం, రోగులు త్వరగా కోలుకునే మార్గాలను వక్తలు వివరించారు. మండలంలోని కరకంబాడీలో ఉన్న అమర హాస్పిటల్‌లో వరల్డ్ ఫిజియోథెరపీడే సందర్భంగా 'హెల్దీ ఏజింగ్ అండ్ ది రోల్ ఆఫ్ ఫిజియోథెరపీ' అంశంపై కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరి, ఎస్వీ మెడికల్ కాలేజ్ బయోకెమిస్ట్రీ విభాగాధిపతి, ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ కౌన్సిల్ మాజీ సభ్యురాలు డాక్టర్ మాధవీలత, ప్రాంతీయ రవాణా అధి కారి మురళిమోహన్ తదితరులు ఫిజియో థెరపీపై ప్రసంగించారు. రోబోటిక్ మోకాలు, హిప్ శస్త్రచికిత్సలపై సాం కేతిక శిబిరాన్ని నిర్వహించారు. ఫిజియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ బిందుప్రియ, ఆర్థోపెడిక్స్ జాయింట్ రీప్లేస్‌మెంట్ కన్సల్టెంట్ సర్జన్ రవికుమార్ అధునాతన రోబోటిక్ టెక్నాలజీతో నిర్వహించే శస్త్రచికిత్సలలో ఫిజియోథెరపీకి ఉన్న ప్రాధాన్యాన్ని వివరించారు. డాక్టర్ ఎన్.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఆరేళ్ల జైలు



హరీష్

వెదురుకుప్పం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి ఆరేళ్ల జైలు శిక్ష విధించారు. 2021 జూలై 24వ తేదీన కార్వేటినగరం మండలం అన్నూరుకు చెందిన మేళం హరీష్ అలియాస్ హరి ఓ 17 ఏళ్ల బాలికను బెదిరించి, అత్యాచారం చేశాడు. దీనిపై మరుసటి రోజున బాలిక తండ్రి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. ఈ కేసు విచారణ సోమవారం చిత్తూరు జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టులో ముగిసింది. నిందితుడికి ఆరేళ్ల జైలు శిక్షతోపాటు రూ.4వేల జరిమానా, బాధితురాలికి రూ.50వేల పరిహారం చెల్లించాలని చిత్తూరు స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఎ.శంకర్‌రావు తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడం నుంచి సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టిన అప్పటి సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ దస్తగిరితోపాటు స్పెషల్ పీపీ మోహనకుమారి, కోర్టు కానిస్టేబుల్ పలని, రామచంద్రయ్య, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టరు చంద్రశేఖర్, సిబ్బందిని ఎస్పీ మణికంఠ ప్రత్యేకంగా అభినందించారు.

దివ్యాంగుల నిరసన

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమ వారం దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. వెరిఫికేషన్ పేరుతో వైకల్యశాతం 90శాతం ఉన్నప్పటికీ 40శాతం వరకు తగ్గించి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తిరుపతి కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రాలు అందజేశారు. దివ్యాంగుల ఫెడరేషన్ మండల అధ్యక్షుడు వల్లమేటి సునీల్, శంకర్, చెల్లెమ్మ పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాలలు



పాకాల పశువైద్యశాలలో పెచ్చులూడి..



కనీస సౌకర్యాలు కరువైన మొగరాల పశువైద్యశాల

పాకాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశువైద్యశాలల్లో కనీస మౌలిక సౌకర్యాలు కరువయ్యాయి. భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన పశువైద్యశాల భవనం అధ్వానస్థితికి చేరుకుంది. భవనంపై కప్పు పెచ్చులూడిపోతోంది. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారి వున్న ఈ వైద్యశాలలో వసతులు అంతంత మాత్రంగా ఉన్నాయి. మొగరాల పశువైద్యశాల ఇరుకైన సిమెంటు రేకుల షెడ్డులో వుంది. కనీస వసతులు లేవు. పదిపుట్లబైలు పశువైద్య కేంద్రం వర్షానికి ఉరుస్తుంది.

దామలచెరువు పశువైద్యశాలలో ప్రహరీగోడ లేదు. నీటి సౌకర్యం లేదు. కోనప్పరెడ్డిపల్లెలోని పశువైద్య కేంద్ర భవనం జాతీయ రహదారి విస్తరణలో సగానికి పైగా పోవడంతో అక్కడ నుండి తోటపల్లెలో మూసివేసిన ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇక్కడా సౌకర్యాలు అంతంత మాత్రమే. మండలంలోని పశువైద్య కేంద్రాలలో సౌకర్యాలు కల్పించాలని, పాకాల, మొగరాల, కోనప్పరెడ్డిపల్లె గ్రామాల్లో కొత్త భవనాలు నిర్మించాలని అధికారులను పాడి రైతులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ ఇలాగేనా?

- సీబీఎస్‌లో డీపీటీవో విస్తృత తనిఖీలు
- రూ. 20వసూలుపై ఆగ్రహం
- ఆంధ్రజ్యోతి కథనాలకు స్పందన



కూల్చివేస్తున్న బస్టాండును పరిశీలిస్తున్న డీపీటీవో



టాయిలెట్ వద్ద సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీటీవో

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారి జగదీష్ సోమవారం సెంట్రల్ బస్సుస్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన కథనాలకు ఆయన స్పందించారు. అడ్వాన్సు రిజర్వేషన్ టికెట్ బుకింగ్ కౌంటర్లు, అవుట్‌గేటు మలుపు విస్తరణ, కూల్చివేసిన ప్లాట్‌ఫారాలు,పల్లెవెలుగు బస్టాండు, కార్గో బుకింగ్, డెలివరీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం బెంగళూరు పాయింట్ టాయిలెట్ వద్దకు వచ్చారు. తన సమక్షంలోనే అక్కడున్న కూలీలు ఓ ప్రయాణికుడి నుంచి రూ.20వసూలు చేయడం గమనించారు. వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు., ఒకే నెల్లో దాదాపు 60సార్లు జరిమానా విధించినా నిర్వాహకులు తీరు మార్చుకోలేదంటూ ఈ టాయిలెట్‌ను మూసివేయాలని ఆదేశించారు. పక్కనే ఉన్న సామూహిక ఉచిత టాయిలెట్ నిర్వహణపై అసంతృప్తి చెందారు. మరోసారి ఇదే పరిస్థితి ఎదురైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్సులు విచ్చలవిడిగా పార్కింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. బస్సుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, తక్షణమే కల్పించుకొని వరుసక్రమంలో పెట్టించాలని, రన్నింగ్ వేలో అడ్డుగా ఉన్న బస్సులను తరలించాలని సెక్యూరిటీ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు చెన్నకేశవులు, లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.

గుట్టుగా ఉండండి ..లేదంటే జైలుకు పంపుతాం

- రౌడీషీటర్లకు ఈస్ట్ సీఐ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కొద్ది రోజులుగా కొందరు రౌడీ షీటర్లు గొడవలకు దిగుతున్నారు. దీనిపై ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలతో డీఎస్పీ భక్తవత్సలం సీరియస్‌గా తీసుకున్నారు. రౌడీషీటర్లను కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు రెండు రోజులుగా రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్టీవీ నగర్, అను చికెన్ సెంటర్, కొర్లగుంట, మారుతీనగర్, సంజయ్ గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో వున్న రౌడీ షీటర్ల జాబితాను బయటకు తీసి వారి కదలికలపై ప్రత్యేక దృష్టి సారించారు. వీరు ఏడాది కాలంలో ఎక్కడెక్కడ రౌడీయిజానికి పాల్పడ్డారు? ఎక్కడ తిరుగుతున్నారు? వీరి అనుచరులు ఎవరనే నివేదికలు తెప్పించుకున్నారు. ఆ ప్రకారం వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పటి వరకు దాదాపు 20 మంది రౌడీషీటర్లకు కఠినమైన తరహాలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. మళ్లీ ఇష్టానుసారంగా మద్యం తాగి రోడ్లపైకి వచ్చి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదని, జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అవసరమైతే వారానికి ఒకరోజు యాక్టివ్ రౌడీలకు కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమం తీసుకుంటామని చెప్పారు. రౌడీ షీటర్లను తహసీల్దారు ముందు బైండోవర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి దుర్మరణం



వస్రీం మృతదేహం

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి దుర్మరణం చెందాడు. ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరు గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా తన కుమారుడు వస్రీం(4)తో కలిసి బైక్‌పై సోమవారం సాయంత్రం 49.కొత్తపల్లెమిట్ట నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యంలో మంగుంట రోడ్డు వద్దకొచ్చేసరికి చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో చిన్నారికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులొచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలేరమ్మ జాతరకు బందోబస్తు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ జాతరలో పటిష్ట బందోబస్తు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ రమణ అన్నారు. సోమవారం స్థానిక పింజల వీరయ్య కళ్యాణ మండపంలో సీఐ మీడియాతో మాట్లాడుతూ వెయ్యి మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 8 ప్రత్యేక బృందాలు. 400పైగా సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా ఉంటుందన్నారు. పోలేరమ్మ ఆర్చి, పోలీస్ స్టేషన్ వద్ద కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి నుంచి వచ్చే భక్తుల వాహనాలకు విశ్వోదయ కళాశాలలో, గూడూరు, రాపూరు, నెల్లూరు నుంచి వచ్చే వాహనాలకు కుమ్మరి గుంట వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్ ఏర్పాటు చేస్తామన్నారు.





తడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు - స్థానిక ఎస్‌బీఐ ఎదురుగా సర్వీస్ రోడ్డుపై మురుగునీరు

ప్రబలుతున్న జ్వరాలు

తడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తడ మండలంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. వాతావరణ మార్పులకు తోడు గ్రామాల్లో పారిశుధ్య లోపం జ్వరాలకు కారణమవుతోంది. ఒక రోజు వర్షం కురిస్తే... మరసటి రోజు చల్లటి గాలులు వీస్తుండగా, అంతలోనే విపరీతమైన ఎండ వేడిమితో జనం తంటాలు పడుతున్నారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, దగ్గుతో అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా గ్రద్దగుంట, తడ, వాటంబేడు గ్రామాల్లో టైఫాయిడ్ కేసులు నమోదు అవుతున్నాయి. రోజుకు సుమారు 20నుంచి 25మంది జ్వరాలతో బాధపడుతూ తడ పీహెచ్‌సీకి వస్తున్నారు. ఇక ప్రైవేట్ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఇదిలా ఉండగా గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మురుగు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రావెల్ దందాపై కలెక్టర్ సీరియస్

రెండు టిప్పర్లను సీజ్ చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు





వనదుర్గాపురం అడవిలో టిప్పర్లకు గ్రావెల్ నింపుతున్న పొక్లెయినర్లు - సీజ్ చేసిన రెండు టిప్పర్లు

పాలసముద్రం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని వనదుర్గాపురం అడవిలో ఉన్న క్వారీ నుంచి తమిళనాడుకు గ్రావెల్‌ను అక్రమంగా తరలించే దందాను మూడ్రోజులుగా ప్రారంభించారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సోమవారం సమాచారం అందడంతో ఆయన సీరియస్ అయ్యారు. వెంటనే తహసీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ చిన్నరెడ్డెప్పకు ఫోన్‌చేసి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేయాలని ఆదేశించారు. ఎస్ఐ, తహసీల్దార్ తమ సిబ్బందితో వెళ్లగా అక్కడున్న తమిళతంబీలు వాగ్వాదానికి దిగారు. చివరకు రెండు టిప్పర్లను మాత్రమే అధికారులు సీజ్ చేశారు.

మిగిలిన వాహనాలను వదిలేయడంపై విమర్శలు

సంఘటన స్థలంలో సుమారు 10 టిప్పర్లు, రెండు పొక్లెయినర్లు ఉన్నాయి. వీటిల్లో కేవలం రెండు టిప్పర్లను మాత్రమే సీజ్ చేయడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

గతంలో ఇలా..

సుమారు ఒకటిన్నర నెల క్రితం వరకు పాలసముద్రం మండలం నుంచి తమిళనాడుకు టిప్పర్లలో గ్రావెల్‌ను అక్రమంగా తరలించేవారు. ఈ విషయం కలెక్టర్‌తోపాటు సీఎం దృష్టికి వెళ్లింది. అప్పట్లో ఎమ్మెల్యే థామస్ ఆదేశాలతో అధికారులు ఆరు టిప్పర్లను సీజ్ చేసి, గ్రావెల్ మాఫియాకు చెక్ పెట్టారు. టిప్పర్లకు భారీ ఎత్తున జరిమానాలు విధించి 15 రోజుల కిందట విడుదల చేశారు.

వనదుర్గాపురం అడవిలో ఉన్న క్వారీకి పర్మిషన్ ఉందని అధికారులు చెబుతున్నారు. 'గ్రావెల్‌ను తమిళనాడుకు తరలించాలంటే ఇక్కడ జీఎస్టీ చెల్లించాలి. జీఎస్టీ చెల్లించక పోవడంతో పాటు ఎలాంటి బిల్లులూ లేకుండానే తమిళనాడుకు భారీ ఎత్తున గ్రావెల్‌ను తరలించేస్తుండటంతో కలెక్టర్ ఆదేశాలతో రెండు టిప్పర్లను సీజ్ చేశాం' అని అధికారులు తెలిపారు.

ఆహార పదార్థాలను వృథా చేయకండి

అన్న క్యాంటీన్లను పరిశీలించిన కమిషనర్



అన్న క్యాంటీన్లను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్లలో ఆహార పదార్థాలను వృథా చేయకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్య ప్రజలను కోరారు. న్యూ బాలాజీ కాలనీలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు ఇస్తున్న టోకెన్లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ క్యాంటీన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆహార పదార్థాల జాబితా బోర్డులు అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 30 వినతులు



పీజీఆర్ఎస్‌లో కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్.)కు 30 వినతులు వచ్చాయి. కమిషనర్ ఎన్.మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చెన్నారెడ్డి కాలనీ శ్మశానంలో మరమ్మతులు చేయించాలని, నీటి సౌకర్యం కల్పించాలని కార్పొరేటర్ పునీత కోరారు. నారాయణపురం, రేణిగుంట రోడ్డులో గుంతలను పూడ్చాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. డీఆర్ మహల్ వద్ద షాపుల వాళ్లు రోడ్డు ఆక్రమిస్తున్నారని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయించాలని కార్పొరేటర్ ఎస్‌కే.బాబు ఫోన్ ద్వారా కోరారు. గొల్లవానిగుంటలో కుక్కలు, పందులు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు తెలిపారు. పెండింగ్లో ఉన్న టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని బాధితులు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ నూతన కార్యవర్గం



పద్మనాభం - గుణశేఖర్ - రాము

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్ యునైటెడ్ ఫ్రంట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన 40 వార్షికోత్సవ సభలో ఈ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా జి.వెంకటేశం, గౌరవ సలహాదారులుగా కేఎస్ఎన్.ప్రసాదరావు, అధ్యక్షుడిగా ఎస్.పద్మనాభం, ప్రధాన కార్యదర్శిగా కాటా గుణశేఖర్, కోశాధికారిగా పి.రాములను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పూజారి రత్న ప్రభాకర్, వి.వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఏ.నరేష్, టి.శ్రీనివాసులు, ఆర్.వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా ఏ.నాగరత్నం, డి.యగేంద్రరావు, బి.హేమంత్‌రెడ్డి, పట్నం దయాకర్, దారా రవికుమార్, ఎం.మురళి, కె.శ్రీనివాసులు, డి.చంద్రనాయక్, జాయింట్ సెక్రటరీలుగా బి.సుబ్రమణ్యం, ఎస్.వెంకటమునిరాజు, పి.రాజశేఖర్, వి.మునికిరణ్ కుమార్, బాలాజీ, ఎం.శివయ్య, మురళీమోహన్, మహిళా కార్యదర్శులుగా జి.లక్ష్మి, వి.ఆదిలక్ష్మి, వై.ప్రతిభాభారతి, కార్యవర్గ సభ్యులుగా పవన్, పురుషోత్తం, అశోక్, గోవిందప్ప, నరేష్‌కుమార్, ప్రభాకర్, భాస్కర్‌రావు, మధుసూదన్‌రావు, వెంకటముని, ధనంజయులు, చొక్కలింగం, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్, మధుసూదన్ రావు, కృష్ణవేణి ఎన్నికయ్యారు.

డాక్టరేట్ ప్రదానం



కిరణ్‌కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగ పరిశోధకుడు బి.కిరణ్‌కుమార్ డాక్టరేట్ పొందారు. ఆప్టికల్ అండ్ లుమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ నియోడియం, ఇటర్బియం-నియోడియం-ఎర్బియం డోప్డ్ ఆక్సిఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ ఫోటానిక్ అప్లికేషన్స్ అంశంపై ఆయన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ బి.దేవప్రసాద రాజు పర్యవేక్షకులుగా వ్యవహరించినట్లు నీఈ రాజమాణిక్యం తెలిపారు.

కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పోలేరమ్మ ఆలయ చైర్మన్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పోలేరమ్మ జాతరను పురస్కరించుకుని సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆలయ కమిటీ మర్యాద పూర్వకంగా కలిసి, ఆహ్వాన పత్రిక అందజేసింది. ఆయనకు తీర్థప్రసాదలను అందజేసింది. ఆలయ ఛైర్మన్, అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు చారిత్రాత్మక నిర్ణయం



మోదీ, నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న శ్రీనివాస్, మధుసూదన్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ అన్నారు. జీఎస్టీ తగ్గింపును హర్షిస్తూ బీజేపీ నాయకులు అన్నారావు కూడలి వద్ద మోదీ, నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు దేశ ప్రజలకు ఊరటనిచ్చిం దన్నారు. మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులు, సాధారణ వినియోగదారులు లాభపడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, చిత్తూరు పార్లమెంటు ఇన్‌చార్జి రాటకొండ విశ్వనాథ్, మాజీ జిల్లా కార్యదర్శి వరప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు అనుష్కశర్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఎన్నో ఉపయోగాలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాల, బర్డ్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిరంతర వైద్య విద్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ శస్త్ర చికిత్సలతో సాధ్యం కాని శారీరక సమస్యలకు ఫిజియోథెరపీతో పరిష్కారం లభిస్తుందన్నారు. వైద్యరంగంలో ఫిజియోథెరపీ ఎంతో ప్రధానమన్నారు. ఫిజియోథెరపీ ప్రాముఖ్యతను, దాని ఫలితాలను వివరించారు. కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ వారు రూపొందించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, వైద్య విభాగాధిపతులు ఉమామహేశ్వరి, రాజేంద్ర పాల్గొన్నారు.

మంగళం క్వార్టర్స్‌లో.. నడివీధి గంగమ్మ ప్రతిష్ఠాపన





ట్రెండ్స్ పాఠశాల కూడలిలో ప్రతిష్ఠించిన నడివీధి గంగమ్మ - సచివాలయం సమీపంలో ఏర్పాటుచేసిన అష్టలక్ష్ములతో శీతలాంబదేవి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మంగళం క్వార్టర్స్‌లో ఎట్టకేలకు నడివీధి గంగమ్మను ప్రతిష్ఠించారు. ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం చేపట్టారు. 1985లో ఎన్టీఆర్ సీఎంగా ఉండగా ఈ క్వార్టర్స్ ఏర్పడింది. తర్వాత కాలంలో శ్రీరాముడు, వినాయకుడు, ఇతర దేవతల ఆలయాల నిర్మాణం జరిగినా నడివీధి గంగమ్మ ప్రతిష్ఠాపన జరగకపోవడం స్థానికులు కొరతగా భావించేవారు. గ్రామదేవత లేకపోవడంతో పిల్లలకు, పెద్దలకు అమ్మోరు పోసినా, ఇతర వ్యాధులు వచ్చినా బయట ప్రాంతాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకునేవారు. గంగజాతర సమయంలోనూ బయట ఆలయాలకు చేరుకుని పొంగళ్లు పెట్టుకునేవారు. ఈ క్రమంలో ఇటీవల ఏర్పాటైన టీడీపీ గ్రామ కమిటీ గంగమ్మ ఆలయ నిర్మాణానికి సంకల్పించింది. ఇంటింటా చందాలు వసూలు చేసి, నడివీధి గంగమ్మతోపాటు అష్టలక్ష్ముల విగ్రహాలను తయారు చేయించారు. స్థానిక రాములవారి గుడిలో ఉంచి 5, 6, 7తేదీల్లో హోమం, పూర్ణాహుతి ఇత్యాది పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆదివారం రాత్రి మంగళం క్వార్టర్స్ పరిధి మేర అష్టలక్ష్ములు, ట్రెండ్స్ ప్రాథమిక పాఠశాల కూడలిలో నడివీధి గంగమ్మను ప్రతిష్ఠాపన చేశారు. పాత అగ్గిపుల్లల తయారీ కేంద్రం ముందున్న ఖాళీ స్థలంలో ఎలమ్మతల్లి ఆలయం ఏర్పాటుకు తీర్మానించారు. ఏటా తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర ముగిసిన తర్వాత వచ్చే మూడో మంగళ, బుధవారాలు జాతర జరపాలని తీర్మానించారు. 40 ఏళ్ల నిరీక్షణ ఫలించినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సంఘం నాయకులు, విద్యార్థులు సోమవారం ముత్యాలరెడ్డిపల్లి కూడలిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలన్న నిర్ణయం ద్వారా పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరమవుతుందని తెలిపారు. వైద్య కళాశాలలను 100 శాతం ప్రభుత్వపరం చేస్తామని మంత్రి లోకేశ్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చి, అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణం నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ వినయ్, ఓంరాజు, మోహన్, తిరుపతి నగర నాయకులు గ్రేస్, హర్ష, రమణ, సుమంత్, శంకర్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు



మీడియాతో మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిమజ్జన కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిమజ్జన మహోత్సవాన్ని ప్రశాంతంగా, నిర్విఘ్నంగా పూర్తి చేయడానికి సహకరించిన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, తుడా, టీటీడీ, ఎస్పీడీసీఎల్, వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులు నవీన్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ వచ్చే ఏడాది ముంబయి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తరహాలో నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఊకా విజయకుమార్, ఎస్వీఎం వెంకటేష్, కరాటే శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగు



రుయాస్పత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న స్విమ్స్ వైద్య విద్యార్థులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపే అవకాశముంటుందని కంటివైద్య విభాగాధిపతి డాక్టర్ ప్రభంజన్‌కుమార్ అన్నారు. ఆగస్టు 25వ తేదీ నుంచి స్విమ్స్ రుయాస్పత్రి, అరవింద కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాల్లో చివరి రోజైన సోమవారం స్విమ్స్ శ్రీపద్మావతి వైద్య విద్యార్థులతో కలిసి ఆయన రుయాస్పత్రిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానం ద్వారా అంధత్వాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. నేత్రాలు దానం చేయడం వల్ల మనం మరణించినా మన కళ్లు మరొకరిలో జీవించే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయిశిల్పా, శ్రావ్య, తేజస్విని, అర్జున్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

తిరుపతి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి) : బైరాగిపట్టెడ పద్మావతి పార్కులో కార్పొరేషన్ నిధులతో జరుగుతున్న ఇంజనీరింగ్ పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ మౌర్యను కోరారు. అసోసియేషన్ సభ్యులు డాక్టర్ టి.జనార్దన్, రాజారెడ్డి, రామచంద్రయ్య ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో జరుగుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తెలిపారు. వాకింగ్ ట్రాక్ అధ్వానంగా వేస్తున్నారని, జిమ్ ఊసే లేదని పేర్కొన్నారు. ప్రధాన గేటు వద్ద పాత బోర్డుకే రంగులు వేయించారని ఆరోపించారు. స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ గోపాలకృష్ణ, ఎం.రవికుమార్, పి.దేవదత్త, ఇరికి సుబ్బారెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో చక్కటి ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంఎస్ డాక్టర్ శ్యాంబాబు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వయస్సు మళ్లిన వారు, వృద్ధులు ఫిజియోథెరపీ చేసుకోవడం వలన మానసికంగా, శారీరకంగా ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉంటారని ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెం డెంట్ డాక్టర్ శ్యాంబాబు అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురష్కరించుకుని ఈఎస్ఐ ఆస్పత్రిలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీ ద్వారా ఎముకలు, కీళ్లు, నరాలు వంటి సమస్యలతో బాధపడే వారికి ఉపశమనం కలుగుతుందన్నారు. అనంతరం ఫిజియోథెరపీ ఆవశ్యకత, దాని వలన పొందే ప్రయోజనాల గురించి ఈఎస్ఐ ఆస్పత్రి ఫిజియోథెరపీ వైద్యుడు వినోద్‌కుమార్ వివరించారు. ఆర్ఎంవో ఎవీఎస్ ప్రసాద్, ఎన్ఎస్ అమ్ములు, సిబ్బంది రాధమ్మ పాల్గొన్నారు.

అభినందన



అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన పద్మావతి మహిళా యూనివర్సిటీ అధ్యాపకులను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు. అవార్డు గ్రహీతలు అధికారులను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

రేపు ధర్మనిధి ఉపన్యాసం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో సీడీ నాయుడు - ఆర్కాట్ ధనలక్ష్మమ్మ ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నారు. గణాంక శాస్త్రవేత్త సీఆర్ రావు 105వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్టాటిస్టికల్ కాన్సెప్ట్ ఇన్ క్వాంటమ్ కంప్యూటింగ్ అంశంపై ఖరగ్‌పూర్ ఐఐటీ రిటైర్డు ప్రొఫెసర్ వి.వాసుదేవరావు ప్రసంగిస్తారు.

రాజారావు ఆశయాలను కొనసాగిద్దాం



రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు ఆశయాలను కొనసాగించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య కోరారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం రాజారావు 62వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. పెంచులయ్య మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢ నమ్మకాలు, నిరక్షరాస్యత, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం రాజారావు చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కళల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చని నమ్మిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, ప్రజానాట్యమండలి నాయకులు పాల్గొన్నారు.

జయపాల్‌కు ఘన సత్కారం



జయపాల్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

తిరుపతి (కల్చరల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకల్లో తిరుపతికి చెందిన ప్రజా కళావేదిక చైర్మన్, కవి, జర్నలిస్టు, సామాజిక కార్యకర్త అరవ జయపాల్‌ను ఘనంగా సత్కరించారు. విద్య, సాహిత్య, సమాజసేవా రంగాల్లో మూడు దశాబ్దాలుగా విశేష సేవలందిస్తున్న నేపథ్యంలో ఈ సత్కారం చేసి జ్ఞాపికను బహూకరించారు. ఫౌండేషన్ ఛైర్మన్ ఎస్.ఆదినారాయణ ఆయన్ను అభినందించారు.

గణపతి ఎంటర్‌ప్రైజస్‌లో అగ్ని ప్రమాదం

రూ.6 లక్షల ఆస్తినష్టం



తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తుడా రోడ్డులోని గణపతి ఎంటర్ ప్రైజస్‌లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రెడిమేడ్ విండోలు, తలుపులు, డోర్లు, హార్డ్‌వేర్ వస్తువులు సగానికి పైగా కాలిపోయాయి. అగ్నిమాపక శాఖ అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి సిబ్బందితో కలసి వచ్చి మంటలను అదుపు చేశారు. షాపు సెల్లార్‌లో ఉండటంతో మంటలను అదుపు చేయడం కష్టమైంది. దాదాపు రూ.6 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు షాపు యజమాని మనోహర్ తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పరిధిలోని 45వ డివిజన్ శివజ్యోతి నగర్ తంబువానిగుంట మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులను పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కదిరి రాజేంద్ర, కొత్తపల్లి మునిరత్నం, టీటీడీ ఉద్యోగ సంఘ విశ్రాంత నేత దాసు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మనీషా గుప్తా, టెలికం మునిరత్నం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటస్థలం లేక అవస్థలు



పాఠశాల ఆవరణలో ఉన్న చిన్న ఖాళీ స్థలం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మంగళం క్వార్టర్స్ ట్రెండ్స్ ప్రాథమిక పాఠశాలలో ఆటస్థలం లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మూడు వందల మందికి పైగా బాలబాలికలు చదువుకుంటున్నారు. రోజువారీ తరగతుల్లో భాగంగా అర్ధగంట కేటాయించిన క్రీడాసమయంలో అక్కడున్న చిన్నపాటి స్థలంలో ఆడుకోలేక అవస్థలు పడుతున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యపై నాయకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఉమ్మడి మంగళం పరిధిలోని ఇతర పాఠశాలలకు పుష్కలంగా మైదానాలు ఉన్నాయి. పిల్లలు చక్కగా ఆడుకుంటున్నారు. ఈ ఒక్క పాఠశాలకు మాత్రం లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో కొంత అప్పగించాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకెళ్లారు.

తిరుమలలో లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్



లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్, కార్పొరేట్ మాజీ లాబియిస్ట్ నీరా రాడియా, తెలంగాణ ఎమ్మెల్సీ దయానంద్ ఉన్నారు.

తిరుమలలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన




బ్రహ్మోత్సవాల్లో ఏర్పాటు చేయనున్న క్యూలైన్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుమల, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలో జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం పరిశీలించారు. మాడవీధుల్లోకి ప్రవేశించే మార్గాలను పరిశీలించారు. గరుడసేవ సమయంలో అదనంగా ఏర్పాటు చేయనున్న క్యూలైన్లపై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు. పలు సూచనలు చేశారు.

తనిఖీలు : పోలీసులు, విజిలెన్స్, బాంబ్‌స్క్వాడ్, రెవిన్యూ, ఫారెస్ట్, ఫైర్, విద్యుత్, హెల్త్ ఆధికారులు రెండు బృందాలుగా విడిపోయి అలిపిరి కాలినడక మార్గంలో తనిఖీలు చేశారు. 150 దుకాణాలను పరిశీలించి నిబంధనలను పాటించని 13 దుకాణాలకు నోటీసులు ఇచ్చారు. సీసీ కెమెరాలు లేని దుకాణ యజమానులను హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న హాకర్లను అదుపులోకి తీసుకుని తిరుపతికి పంపారు. ఇలా ఉండగా అత్యవసర సమయాల్లో భక్తులకు సీపీఆర్ చేసే అంశంపై సోమవారం పోలీసు సిబ్బందికి తిరుపతి రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్లు ప్రసాద్, ప్రతీత్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 27,410

తలనీలాలు సమర్పించినవారు: 9,656

బుర్రకథ అడ్డం తిరిగిందే!



వీధుల్లో భిక్షాటన చేస్తున్న బుర్రకథ కళాకారులు

కాలప్రవాహంలో కొన్ని కళలు అంతరించిపోవడం, కొన్ని రూపాలు మార్చుకోవడం సహజం. ఒకప్పుడు పల్లెల్ని ఉర్రూతలూగించిన జానపద కళల్లో బుర్రకథ ఒకటి. ఒక ప్రధాన కళాకారుడు కథ చెబుతుంటే, ఇద్దరు వంత పలుకుతూ ఉంటారు. జిలుగు వెలుగుల దుస్తులు, తలపాగా, వాయిద్యాలతో వీరు కథను రక్తి కట్టిస్తారు. ప్రధాన కథ మధ్యలో వీరు చెప్పే పిట్టకథలకు జనం పగలబడి నవ్వేవారు. వేసవి కాలంలో ఊరుమ్మడిగా బుర్రకథలను చెప్పించుకునేవారు. కళాకారులకు ధన, ధాన్యాలిచ్చి సత్కరించేవారు. ఈ జానపద కళ.. జాతీయోద్యమంలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో కీలక పాత్ర పోషించింది. కమ్యూనిస్టు పోరాటాల్లోనూ బుర్రకథది ప్రధాన భూమిక. గతం ఘనమే కానీ వర్తమానం మాత్రం బుర్రకథ కళాకారులకు దయనీయంగా మారింది. అందుకు సాక్ష్యమే ఈ చిత్రం. డక్కిలి మండలం వెంబులూరు హరిజనవాడకు చెందిన వెంకటయ్య దేశరాజుకథ, కళింగరాజుకథ, మరాటీలకథ, చంద్రబోస్, లక్ష్మమ్మ, చిన్నయ్య, గంగా కళ్యాణం, తాంబోజురాజు కథ, పసలబాలుడికథ వంటివి బుర్రకథలుగా చెప్పేవాడు. అనేక ఊళ్లలో ఈయనను పిలిచి కథలు చెప్పించుకునేవారు. ఒకప్పుడు ఆలయాల్లో, ఊరి కూడళ్లలో ఏర్పాటు చేసిన వేదికలమీదా కథలు చెప్పిన వెంకటయ్య ఇప్పుడు సైకిలేసుకుని ఊరూరా తిరుగుతున్నాడు. కథ చెప్పించుకునేవారు కరువవడంతో ఇల్లిల్లూ తిరిగి కథలోని ఒక పాటో, పద్యమో వినిపించి చేతులు చాస్తున్నాడు. ఇదే ఆయనకు కూడు పెడుతోంది. ప్రస్తుతం వెంకటగిరి 7వ వార్డు కోళ్ళ ఫారం వద్ద నివాసం ఉంటున్న ఇతను తన చిన్నాన్న కొడుకు పోలయ్యతో కలిసి ఇలా పల్లెలు తిరుగుతున్నాడు. 'సేద్యం పను లుంటే పల్లెలోనే కూలి దొరికేది.. ఇట్లా టవున్లలో తిరిగి నాలుగిళ్లు అడుక్కుంటేనే కడుపు నిండుతోంది' అని చెబుతున్నాడు వెంకటయ్య.

- వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

పీజీఆర్ఎస్ వినతులపై ప్రత్యేక దృష్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 106 వినతులు వచ్చాయి. 9 కౌంటర్లు ఏర్పాటు చేసి, వినతులు స్వీకరించారు. ఎస్పీ నేరుగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐలు పాల్గొన్నారు.

పకడ్బందీగా మిషన్ సంకల్ప అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మిషన్ సంకల్ప కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సంకల్పపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో జిల్లాలో సంకల్ప కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మహిళలు, ఆడపిల్లలపై సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై అవగాహన కల్పించడానికి ఈ నెల 12వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ కృష్ణమంజరి, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ వాసంతి, అధికారిణి సుధారాణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి.. మహాప్రభో!

- పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల మొర

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'వారాలుగా తిరుగుతూనే ఉన్నాం.. సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.. ఇప్పటికైనా దృష్టి పెట్టండి' అంటూ పలువురు అర్జీదారులు కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లావ్యాప్తంగా ప్రజలు హాజరై సమస్యలపై అర్జీలు అందజేశారు. మొత్తం 238 అర్జీలు రాగా, అందులో భూసమస్యలపై 150 వచ్చాయి. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రైసైకిల్, వీల్‌చైర్ అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

ఎరువుల కొరత తీర్చాలని ధర్నా



రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచులయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమల పేరుతో భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందే తప్పా వారి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. యూరియా, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పింఛను కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా



అనారోగ్యం కారణంగా రెండేళ్ల నుంచి వెన్నెముక పని చేయడంలేదు. లేచి కూర్చునే పరిస్థితి కూడా లేదు. వికలాంగ పింఛను కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా. మీరైనా దయుంచి ఇప్పించండి.

- రమేష్, మేదరపల్లి, ఎర్రావారిపాళెం మండలం

బిల్డర్ మోసం చేశాడు..న్యాయం చేయండి



అపార్టుమెంట్ నిర్మాణం కోసం మేము 15మంది తిరుపతికి చెందిన బిల్డర్ చెంచయ్యకు లక్షలాది రూపాయలు చెల్లించాం. సదరు బిల్డర్ నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌పై ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి భారీ మొత్తంలో రుణం తీసుకున్నాడు. రుణం చెల్లించకపోవడంతో అపార్ట్‌మెంట్‌పై హక్కులు మావే అని బ్యాంకు వారు కోర్టుకు వెళ్లారు. బిల్డర్‌పై చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయండి.

- నారాయణస్వామి తదితరులు, తిరుపతి

పింఛను ఇప్పించండి



మా అబ్బాయి జశ్వంత్ అనారోగ్యం కారణంగా వంచానికే పరిమితమయ్యాడు. లేచి నిలుచుకునే పరిస్థితిలో లేడు. ప్రస్తుతం రూ.6వేలు పింఛను వస్తోంది. రూ.15వేలు ఇప్పించి ఆదుకోండి.

- జశ్వంత్ తల్లిదండ్రులు, మద్దాలి, కోట మండలం

ఇళ్లు ఖాళీ చేయమంటున్నారు.. న్యాయం చేయండి



సర్వే నెంబరు 27/1లో 50ఏళ్లుగా 15 కుటుంబాలు కాపురముంటున్నాయి. ఇటీవల జాతీయ రహదారి విస్తరణ కోసం ఇళ్లు ఖాళీ చేయమని నేషనల్ హైవేవారు నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెడుతున్నారు. పరిహారం, ఇంటి స్థలం ఇవ్వకుండా మేము ఎక్కడికి వెళ్లాలి. దయుంచి న్యాయం చేయాలని వరదయ్యపాళెం మండలం తొండూరు గ్రామ పంచాయతీ శ్రీహరికోట ఎస్సీ కాలనీవాసులు గోపి, భాస్కర్, రమేష్, యశోదమ్మ, వెంకటేష్ కలెక్టర్‌ను కోరారు.

గౌరవ వేతనం చెల్లించాలి

ఇమాం, మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించాలని వైసీపీ నేతలు మహ్మద్ కాసీం, ఇమ్రాన్ తదితరులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత సెప్టెంబరు నుంచి గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

దోబీఘాట్ స్థలాన్ని పరిరక్షించండి

తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలో రజకుల కోసం కేటాయించిన దోబీఘాట్ స్థలం కబ్జాకు గురైందని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుని స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

బోల్తాపడ్డ కారు



తిరుచానూరు, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి రేణిగుంట వైపు వెళుతున్న కారు సోమవారం వేకువజామున తిరుచానూరు హరిజనవాడ వద్ద హైవే నుంచి పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. మద్యం తాగి అతివేగంగా కారు నడిపినట్లు స్థానికులు చెప్పారు. డ్రైవర్ కారును అలాగే వదిలేసి వెళ్లిపోగా తిరుచానూరు పోలీసులు క్రేన్ సాయంతో వెలికితీశారు.

రేపు, ఎల్లుండి ఆర్చరీ, స్కేటింగ్ పోటీలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈనెల 10న అండర్ 14, 17, 19 విభాగాలలో ఆర్చరీ, 11న తిరుపతి శ్రీనివాస క్రీడా సముదాయంలో అండర్ 11, 14, 17, 19 విభాగాలలో స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టు తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9290502041(ఆర్చరీ), 9985533560(స్కేటింగ్)లను సంప్రదించాలని కోరారు.

బంగారు నగల దుకాణంలో చోరీ యత్నం

- యజమాని అప్రమత్తతో ఉడాయించిన ఇద్దరు మహిళలు
- ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు



దుకాణంలో నగలను పరిశీలిస్తున్న మహిళలు



చోరీకి యత్నించిన మహిళను పట్టుకొని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం బజారువీధిలోని ఓ బంగారు నగల దుకాణంలో ఇద్దరు మహిళలు చోరీకి యత్నించారు. యాజమాని అప్రమత్తం కావడంతో పరారయ్యారు. వారిని స్థానికులు వెంబడించి ఒక మహిళలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణం బజారువీధిలో శ్రీనివాసులు అనే వ్యక్తి బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఇద్దరు మహిళలు గొలుసులు, పట్టీలు కావాలంటూ దుకాణానికి వచ్చారు. శ్రీనివాసులు గొలుసులు, పట్టీల సెట్‌ను వారి ముందు ఉంచాడు. గొలుసులను పరిశీలిస్తున్న మహిళలు తీరును గమనించిన శ్రీనివాసులుకు అనుమానం వచ్చింది. రెండు నెలల క్రితం ఇద్దరు మహిళలు దుకాణానికి వచ్చి గొలుసులు అపహరించుకుని వెళ్లారు. అయితే నిందితులను గుర్తించక ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోయాడు. సోమవారం వచ్చిన మహిళలే గతంలో గొలుసులు అపహరించుకుని వెళ్లిన ఉంటారని భావించి, వారిని అనుక్షణం పరిశీలిస్తూ అప్రమత్తంగా వ్యవహించాడు. ఇది గమనించి సదరు మహిళలు వెంటనే దుకాణం నుంచి వెళ్లిపోతూ పరుగులు తీయగా శ్రీనివాసులు వారిని వెంబడిస్తూ కేకలు వేశాడు. సమీపంలోని రాజగోపాలపురంలో స్థానికులు ఒక మహిళను పట్టుకున్నారు. ఇంతలో అక్కడకు చేరుకున్న దుకాణ యజమాని శ్రీనివాసులు సమక్షంలో పోలీసులకు అప్పగించారు. ఇంకో మహిళ తప్పించుకోవడంతో ఆమె కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కాగా, ఈ ఇద్దరు మహిళలు సత్యవేడులోని బంగారు దుకాణాల్లో చోరీకి పాల్పడిన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో విచారణ చేపట్టారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న కుమార్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : డప్పు కళాకారులను అన్ని విధాలా ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఏపీ ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల డప్పు కళాకారుల సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3వేల పింఛను పెంచాలని కోరారు. కళాకారులకు భాషా సాంస్కృతిక శాఖ గుర్తింపు కార్డులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ ప్రభుత్వపరమైన సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు, మురగారెడ్డి, పి.రెడ్డెప్ప, అంజయ్య, మురళి, సహదేవయ్య, వెంకటేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌డీఎస్ఎస్' పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయండి



సీజీఎం జె.రమణాదేవి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పథకం పనులను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని నిర్మాణాల విభాగం చీఫ్ జనరల్ మేనేజరు జె.రమణాదేవి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం అన్ని జిల్లాల నిర్మాణాల విభాగం అధికారులతో ఆమె సమీక్షించారు. గ్రామీణ ప్రాంలతాల్లో త్రీఫేజ్ లైన్లు లేని గ్రామాల్లో లైన్లు లాగి విద్యుత్ సరఫరాను మెరుగు పరిచే పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ పనులు పూర్తి చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి, ప్రజలకు, కుటీర, చిన్నతరహా పరిశ్రమలకు ఉపయోగ పడుతుందన్నారు. సమావేశంలో తొమ్మిది జిల్లాల ఈఈలు, డీఈఈలు ప్రాజెక్టుల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఫైర్ డిటెక్షన్ హెచ్చరికతో ఆగిన హౌరా ఎక్స్‌ప్రెస్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హౌరా నుంచి తిరుచిరాపల్లికి వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సోమవారం రాత్రి సూళ్లూరుపేట రైల్వే గేటు వద్ద ఆగిపోయింది. రాత్రి 7 గంటల సమయంలో హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సూళ్లూరుపేట స్టేషన్ దాటి తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న రైల్వేగేటు వద్దకు చేరుకోగానే రైలులో ఫైర్ సిస్టమ్ అలారం మోగింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ అత్యవసరంగా రైలు నిలిపివేశాడు. వెంటనే రైల్వే సిబ్బంది అక్కడికి చేరుకుని బోగీలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎటువంటి సాంకేతిక లోపం లేదని నిర్ధారించిన తరువాత రైలు బయలుదేరింది. ప్రయాణికులు సిగరేట్ కాల్చి ఉంటారని, ఆ పొగకు ఫైర్ సిస్టం అలారం మోగి ఉండవచ్చునని రైల్వే సిబ్బంది అనుమానిస్తున్నారు. దాదాపు 15 నిమిషాలు రైలు ఆగిపోవడం, సిబ్బంది అన్ని భోగీల్లో తనిఖీలు చేపట్టడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

వ్యాను ఢీకొని ఒకరి దుర్మరణం



మృతిచెందిన అమరనాథరెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలోని సర్వీసు రోడ్డులో వ్యాను ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం పైడిపల్లికి చెందిన అమరనాథరెడ్డి సోమవారం రాత్రి 10 గంటల సమయంలో శానంబట్ల నుంచి తిరుపతి వైపు వస్తున్నారు. అదేసమయంలో తిరుపతి నుంచి బెంగళూరు వస్తున్న వ్యాను ఢీకొంది. ఈప్రమాదంలో అమరనాథరెడ్డి(31)కి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన వేదపారాయణదార్ పోస్టుల భర్తీ

- విమర్శల నేపథ్యంలో నిలుపుదలకు ఆదేశిమిచ్చిన టీటీడీ

తిరుమల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో వేదపారాయణదార్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. కేవలం ఓ ప్రాంతవాసులకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు, ఫిర్యాదుల నేపథ్యంలో దాదాపు 700 పోస్టుల భర్తీని టీటీడీ రద్దు చేసింది. గత ప్రభుత్వానికి సానుభూతిపరుడిగా ముద్ర ఉన్న ఓ అధికారి తమిళులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ కొందరు బ్రహ్మణులు సీఎంవోతో పాటు మంత్రి లోకేశ్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 11వ తేదీన ఇంటర్వ్యూలు జరగాల్సి ఉన్న క్రమంలో ఈ పోస్టుల వ్యవహారానికి రాజకీయ, ప్రాంతీయ రంగు పులుముకుంది. దీంతో పోస్టుల భర్తీని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు విశ్వసనీయమైన సమాచారం.

రూ.లక్షల విలువైన మందులు వృథా

- కాలం చెల్లడంతో డిస్పోజబుల్ కేంద్రానికి తరలింపు

డక్కిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన మందులు మట్టిపాలయ్యాయి. సకాలంలో వినియోగించుకోకపోవడంతో కాలం చెల్లిన మందులను వృథాగా పడేయాల్సి వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి డక్కిలి ప్రభుత్వాస్పత్రి నుంచి మందులను తీసుకెళ్తున్న ట్రాక్టరును స్థానికులు గుర్తించి అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఈ విషయం తెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానిక వైద్యాధికారిణి బిందుప్రియాంకను వివరణ కోరగా.. అవి డక్కిలి ఆస్పత్రికి చెందిన మందులు కాదని, 104 ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన మందులని తెలిపారు. కాలం చెల్లిపోవడంతో రాపూరులోని డిస్పోజబుల్ కేంద్రానికి ట్రాక్టరు తీసుకెళుతుండగా కొంత మంది ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ ఆర్ఎంపీ వైద్యుడు ఈ ఘటనను తప్పుదారి పట్టించేందుకు ప్రయతిస్తున్నారని, దీనిపై విచారణ చేపడతామని డాక్టర్ బిందుప్రియాంక చెప్పారు.



డక్కిలి ప్రభుత్వాస్పత్రి నుంచి మందులను తీసుకెళ్తున్న ట్రాక్టరు

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రబలుతున్న జ్వరాలు




తడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు - స్థానిక ఎస్‌బీఐ ఎదురుగా సర్వీస్ రోడ్డుపై మురుగునీరు

తడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తడ మండలంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. వాతావరణ మార్పులకు తోడు గ్రామాల్లో పారిశుధ్య లోపం జ్వరాలకు కారణమవుతోంది. ఒక రోజు వర్షం కురిస్తే... మరసటి రోజు చల్లటి గాలులు వీస్తుండగా, అంతలోనే విపరీతమైన ఎండ వేడిమితో జనం తంటాలు పడుతున్నారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, దగ్గుతో అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా గ్రద్దగుంట, తడ, వాటంబేడు గ్రామాల్లో టైఫాయిడ్ కేసులు నమోదు అవుతున్నాయి. రోజుకు సుమారు 20నుంచి 25మంది జ్వరాలతో బాధపడుతూ తడ పీహెచ్‌సీకి వస్తున్నారు. ఇక ప్రైవేట్ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఇదిలా ఉండగా గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మురుగు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జీవన ఎరువులపై రైతులకు అవగాహన

వాకాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలిపూడి రైతుసేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయశాఖ అధికారిణి దీప ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ, జీవన ఎరువుల ఉపయోగాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో దీప మాట్లాడుతూ దమ్ములో ఘన రూప యూరియాను మొదటిసారిగా వేసుకుని, తదుపరి దశల్లో నానో యూరియాను పైరుపై పిచికారి చేసుకోవాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీలను పురుగుమందులతో కలిపి కూడా పిచికారి చేసుకోవచ్చని, తద్వారా రైతుకు ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులు ఖరీఫ్ సాగును దృష్టిలో ఉంచుకొని నానో యూరియా, నానో డీఏపీ జీవన ఎరువులను వాడుకొని అధిక ఉత్పత్తులను పొందాలన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి పురస్కారం



నారాయణరావును అవార్డుతో సత్కరిస్తున్న ప్రముఖులు

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సీవీఎస్ నారాయణ రావుకు ఆచార్య దేవోభవ పురస్కారం అందింది. హైదరాబాదులోని త్యాగరాయగాన సభలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పినాకిని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నారాయణరావుకు ఆచార్య దేవోభవ అవార్డు బహూకరించారు. ఈ మేరకు అచార్య కొలకనూరి ఇనాక్, మునగా రామ మోహన్‌రావు, ఓరుగంటి కృష్ణవేణి తదితరులు జ్ఞాపిక, అవార్డుతో అభినందించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం: బీటీఏ



మహిళా ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇస్తున్న బీటీఏ నాయకులు

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలకు ఊపిరిపోస్తామని బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. మండల పరిధిలోని చిట్టేడు, కేశవరం, కొండుగుంట ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం బీటీఏ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా బీటీఏ నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీని నియమించి 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. అదే విధంగా సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీటీఏ మండల అధ్యక్షుడు పేర్నాటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి మట్టిగుంట శ్రీనివాసులు, ఐవీ రమణయ్య, సుబ్బారావు, ఏడుకొండలు, సుబ్రహ్మణ్యం, నాగరాజు, శంకరయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి సహకారంతో హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టిహకారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, జరీనాబేగం, ధనుర్ల, శ్రీనివాసులు, మురళీ నాయుడు, రామ్మోహన్‌రావు, నవీన్ జయకుమార్, వెంకటేశ్వరరావు, ప్రభాకర్, నాగరాజు, కృష్ణారెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో హోమపూజలు



హోమ పూజల్లో భక్తులు

గూడూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయదుర్గాదేవి ఉపపీఠంలో సోమవారం రాహుగ్రస్త చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమపూజలు జరిగాయి. శతభిషానక్షత్రం, పూర్వాభాద్రనక్షత్రం, దుర్గాత్రిశతి, లలిత అష్టోత్తరం, శక్తిమాల, రుద్రం, లక్ష్మీనరసింహస్వామి మూలమంత్రం, మహాగణపతి అష్టశక్తుల మూలమంత్రం, మంత్రంసహితం హోమపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎరువుల కొరతను నివారించాలి

చిల్లకూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల కొరతను నివారించి రైతులకు సక్రమంగా సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎరువుల కొరతపై సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యూరియా, డీఏపీ వంటి ఎరువుల కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు వ్యాపారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, రమేష్, నారాయణ, సునీల్, గోపాల్, వెంకటేశ్వర్లు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం

చిల్లకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు అక్షరం ఆకృతిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పయోజన విద్య, సార్వత్రిక విద్య ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనసూయ, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, కామేశ్వరి, శ్రీనివాసులు, రవీంద్ర, రమణయ్య, లీల, నాగభూషణమ్మ, శేషారెడ్డి, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెర్రికాలువలో వ్యర్థాల తొలగింపు

రైతులే ముందుకొచ్చి పనులకు శ్రీకారం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాలకు సాగునీరందించే నెర్రికాలువ కాలుష్య కోరల్లో చిక్కుకొని వ్యర్థాలతో నిండిపోయిందని, పూడిక తీయించి పంటలకు నీరందేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఏడు గ్రామాల రైతులు పలుసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇక చేసేదేమి లేక గోపాల్‌రెడ్డిపాలెం, గొల్లలమొలువు, పల్లిపాలెం, కారిజాత, పాములమిట్ట గ్రామాలకు చెందిన రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి నెర్రికాలువలో పేరుకపోయిన వ్యర్థాలను తొలిగించేందుకు పూనుకున్నారు. గొల్లలములువు వద్దనున్న రైల్వే గేటు నుంచి యంత్రాల సాయంతో రైతులే దగ్గరుండి వ్యర్థాలను తొలగించి పూడిక తీయిస్తున్నారు. రైల్వేగేటు వద్దనుంచి చెంగాళమ్మ ఆలయ సమీపంలోని లెప్రసి కాలనీ వరకు పూడిక తీయించారు. అక్కడ నుంచి మురుగునీటితో పాటు బురద ఎక్కువగా ఉండడంతో పనులు ఆగిపోయాయి. పట్టణ డ్రైనేజీ నీటితో కాలువ నిండిపోయి ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో కాలువలో పూడిక తీయలేక పలుచోట్ల యంత్రాలు సైతం దిగబడిపోవడంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు నెర్రికాలువ పొర్లుకట్టకు గండ్లు పడడంతో సాగునీటి పారుదల పూర్తిగా ఆగిపోయింది. అలాగే సూళ్లూరుపేట పట్టణానికి చెందిన మురుగు నెర్రికాలువలోకి చేరి సాగునీరు కలుషితం అయింది. కాలువలో పూడిక తీయించి సాగునీరు అందేలా రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పంచాయతీరాజ్‌శాఖ విశ్రాంత ఈఈ గిరినాథ్ అన్నారు. సోమవారం స్థానిక సరస్వతిశిశు మందిరంలోని పేద విద్యార్థులకు ఫీజుల నిమిత్తం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గిరినాథ్ సహకారంతో రూ.37వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. దాతలు అందిస్తున్న సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గిరినాథ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మురళీరెడ్డి, రమణయ్య, రవిచంద్రరెడ్డి, రియాజ్ అహ్మద్, మయూరి శ్యామ్ యాదవ్, రూపేష్‌రెడ్డి, వీరేంద్రనాథ్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ



విశ్వనాథ నాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ఆదివారం జరిగిన గ్రామశక్తి పోలేరమ్మ ఘటోత్సవంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ విశ్వనాథ నాయుడు గాయపడటంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. సోమవారం వెంకటగిరికి చేరుకున్న ఆయనను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. అలాగే పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ మురళీకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర బ్లయిండ్స్ స్పోర్ట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచలనరసయ్య, లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు రంగినేని రాజా, టీడీపీ నాయకులు మురళీగౌడ్, సురేంద్ర, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వేణు తదితరులు ఏఎంసీ చైర్మన్‌ను పరామర్శించారు.

క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేత

నాయుడుపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఏ సాగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో క్షయవ్యాధి గ్రస్తులకు నెల్లూరుకు చెందిన భాగ్యలక్ష్మి, కృష్ణయాదవ్ దంపతులు తమ కుమార్తె లాస్య పుట్టినరోజు సందర్భంగా సోమవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుబ్బారావు, సూపర్ వైజర్ రమణయ్య, రాజావిక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చలివేంద్రం వద్ద మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఓజిలి మండలం పాపిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వినోద్ మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా చలివేంద్రం వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

ఫిజియో థెరపిస్టుకు సన్మానం

నాయుడుపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాధికాస్ వెల్‌నెస్ సెంటర్‌లో సోమవారం ప్రపంచ ఫిజియో థెరపి దినోత్సవం సందర్భంగా ఫిజియో థెరపిస్టు డాక్టర్ విజయమేరీని ప్రముఖులు సన్మానించారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ సుబ్బారావు, వరప్రసాద్, రమేష్, బందిల మోహన్, ప్రేమ్‌కుమార్, శేఖర్‌బాబు, రాధిక, శ్యామల, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

మా ఊళ్ల దగ్గర డంపింగ్ యార్డు వద్దు

చెత్త ట్రాక్టర్లను అడ్డకుని స్థానికుల నిరసన



ఆందోళనకారులకు నచ్చచెబుతున్న పోలీసులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డును తమ గ్రామాల సమీపంలో ఏర్పాటు చేయవద్దంటూ పెరిమిటిపాడు, కొణ్ణంబట్టు, ఇసకపాలెం గ్రామస్తులు సోమవారం చెత్త ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. గత నెలలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ డంపింగ్ యార్డుకు కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 131లో 10 ఎకరాల భూమి కేటాయించారు. రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీకి సంబంధిత పత్రాలు, భూమిని సైతం అప్పగించారు. మున్సిపాలిటీలో పోగయిన చెత్తను ఆ భూముల్లో డంపింగ్ చేయడానికి వెళ్లిన ట్రాక్టర్లను వారం రోజుల క్రితం కూడా కొణ్ణంబట్టు, ఇసకపాలెం గ్రామస్తులు అడ్డగించి ఆందోళన చేశారు. మళ్లీ సోమవారం చెత్త ట్రాక్టర్లను అడ్డుకుని తమ ప్రాంతంలో చెత్తను వేస్తే ట్రాక్టర్లను పెట్రోలు పోసి కాల్చేస్తామంటూ నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న సీఐ మురళీకృష్ణ, తడ ఎస్‌ఐ కొండప నాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామాల సమీపంలో భూములను డంపింగ్ యార్డుకు కేటాయించడం అన్యాయమని, పట్టణంలోని చెత్తను తీసుకొచ్చి తమ గ్రామాల వద్ద నిల్వ చేస్తే కాలుష్యం పెరిగిపోతుందన్నారు. పోలీసులు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా అంగీకరించలేదు. దీంతో పోలీసులు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను పిలిపించి ఆందోళన కారులతో పోలీసులు మాట్లాడించారు. రెండు రోజులు సమయం ఇస్తే కలెక్టర్ వద్దకు వెళ్లి సమస్యను వివరిస్తామని, అప్పటి వరకు ఇక్కడ చెత్త వేయవద్దని గ్రామస్తులు కోరారు. దీంతో మున్సిపల్ అధికారులు చెత్త ట్రాక్టర్లను తీసుకుని వెనుదిరిగారు.

పోలేరమ్మ జాతరకు పటిష్ఠ బందోబస్తు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ జాతరలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ రమణ అన్నారు. సోమవారం స్థానిక పింజల వీరయ్య కళ్యాణ మండపంలో సీఐ మీడియాతో మాట్లాడుతూ వెయ్యి మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 8 ప్రత్యేక బృందాలు. 400పైగా సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా ఉంటుందన్నారు. పోలేరమ్మ ఆర్చి, పోలీస్ స్టేషన్ వద్ద కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతరలో జూదాలు, డైమండ్ డబ్బాలు వంటివి పూర్తి నిషిద్ధమని స్పష్టం చేశారు. తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి నుంచి వచ్చే భక్తుల వాహనాలకు విశ్వోదయ కళాశాలలో, గూడూరు, రాపూరు, నెల్లూరు నుంచి వచ్చే వాహనాలకు కుమ్మరిగుంట వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా క్యూలైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, ఎస్‌ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



రథంలో ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

చిట్టమూరు, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాంలో జరుగుతున్న శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవం కనులపండువగా సాగింది. శ్రీవళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు రథాన్ని లాగి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మిరియాలు, ఉప్పు రథంపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రథం ముందు పోలి టెంకాయలు కొట్టారు. రథోత్సవానికి భక్తులు భారీసంఖ్యలో రావడంతో గూడూరు డీఎస్పీ గీతా కుమారి, వాకాడు సీఐ హుస్సేన్ భాషా, చిట్టమూరు, వాకాడు, కోట ఎస్‌ఐలు చిన్న బలరామయ్య, నాగబాబు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు మల్లాం యూత్ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు డీపీవో సుశీలాదేవి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె త్వరలో డిజిటల్ అసిస్టెంట్ నియమిస్తామని చెప్పారు.

మృత్యుంజయుడికి వేదోక్తంగా పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిలో భాగస్వాములవుతాం

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోటలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిలో భాగస్వామలవుతామని ఆరోగ్య సలహామండలి సభ్యులు, టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సాధారణ సమావేశం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ అధ్యక్షతన సోమవారం జరిగింది. వైద్యాధికారి డోమ్‌ప్రియారావు పలు సమస్యలను సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదులకు ఫీజర్ బాక్సును ఉచితంగా ఇస్తామని టీడీపీ నాయకుడు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆస్పత్రి కాంపౌండ్ వాల్‌కు గేట్, మట్టి తోలకాలకు తనవంతు సహకారం అందిస్తామని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ముందుకువచ్చారు. అదే విధంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఆస్పత్రి ఆవరణ వరకు రోడ్డుకు ఇరువైపులా వీధిలైట్లు వేయిస్తానని దిలీప్‌కుమార్ నాయక్ హామీ ఇచ్చారు. అలాగే కొత్త ఈసీజీ మిషన్ కొను గోలు ప్రతిపాదనలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దారా ప్రమీల, బాలసుబ్రహ్మణ్యం, బాబు, వైద్యాధికారులు పృద్వీరాజ్, డోమ్‌ప్రియారావు, ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వానం



వెంకటగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతకు విచ్చేయాని జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌కు ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, ఈవో శ్రీనివాసులురెడ్డి సోమవారం ఆహ్వానపత్రిక అందజేశారు.

ప్రభుత్వ పాఠశాల పరిశీలన

కోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని శ్యామసుందర పురంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను సోమవారం డైట్ లెక్చరర్ శ్రీనివాసులు పరిశీలించారు. ఎంఈవో మస్తానయ్యతో కలసి విద్యార్థుల సామర్థ్యాలను పర్యవేక్షించారు. అదేవిధంగా పాఠశాలలోని మరుగుదొడ్లు, వంటగదులు పరిశీలించారు.

పుత్తూరు వార్తలు

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలు క్రియాశీలకంగా ఉంటాయని, వాటిని సానుకూలంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. సోమవారం వడమాలపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామ, సామాజిక సమస్యలపై కూడా దృష్టి సారించాలని చెప్పారు. పాదిరేడు అటవీభూముల పరిహారానికి సంబంధించి అర్హులకు న్యాయం చేయాలని చెప్పారు. తహసీల్దార్ జరీనా, ఎంపీడీవో హరినాథ్‌బాబు, జట్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు దాముయాదవ్, నాయకులు ధనంజయులు నాయుడు, వెంకటయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 35 అర్జీలు రాగా, అందులో 25 మంది రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని వినతులు ఇచ్చారు. సీతారామపురంలో పశువుల బాట ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. శ్మశానానికి స్థలం, దారి చూపాలని వడమాల ఆది ఆంధ్రవాడవాసులు ఎమ్మెల్యేను కోరారు.

ఆక్రమణల తొలగింపునకు రాజకీయ గ్రహణం

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. పుత్తూరు- తిరుపతి రహదారిలో 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు 40 అడుగులకు కుచించుకుపోయింది. ఆక్రమణలతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సోమవారం పట్టణ ప్రణాళిక విభాగ అధికారి నీరజాక్షి చొరవ తీసుకుని ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. సిబ్బందితో వెళ్లి కూరగాయలు, పండ్ల బండ్లను తొలగించారు. ఇంతలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్నారు. వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దంటూ కోరారు. దీంతో అధికారులు అక్కడినుంచి వెనుదిరిగారు. పుత్తూరు పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. రెండు రోజుల క్రితం అంబేడ్కర్ కూడలిలో ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఆ విద్యార్థి తండ్రి ట్రాఫిక్ అంతరాయం కలిగించే ఆక్రమణలను తొలగించని మున్సిపల్, పోలీస్ అధికారులపై కోర్టులో ప్రైవేటు కేసు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న అధికారులు ముందస్తు చర్యలకు సిద్ధమయ్యారు. పోలీసులను సంప్రదించిన మున్సిపల్ అధికారులకు నిరాశ మిగిలింది. సమస్య తమ పరిధిలోనిది కాదంటూ చేతులు దులుపుకున్నారు. దీంతో చేసేది లేక మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది ఆక్రమణల తొలగింపునకు యత్నించారు. కానీ ఆ ప్రయత్నం రాజకీయ గ్రహణంతో నిలిచిపోయింది.

అనధికార లే అవుట్లపై దాడులు

మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనధికార లే అవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించింది. కాగా, తమకేమీ పట్టనట్లుగా ప్లాట్ల యజమానులు వ్యవహరిస్తున్నారు. జీవో జారీ చేసి నెలన్నర గడుస్తున్నా ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ చర్యలకు ఉపక్రమించారు. సోమవారం లే అవుట్లలోని అనధికార ప్లాట్ల హద్దులను తొలగించారు. వినాయకపురం యానాది కాలనీ, వినాయకపురంలోని సర్వే నెం.24-3బి1, 29-9మ2, 29-10లోని 2.26 ఎకరాలు, 80/5లోని అనధికార లే అవుట్లలో సరిహద్దు రాళ్లను తొలగించారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయండి

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): పెండిగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏలను మంజూరు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుణశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం తిరుపతి వాసవీ కంటి వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. కుప్పయ్య, రామలింగం, కృపావరమ్మ, రామ్మూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ



పుత్తూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరతపై వైసీపీ తలపెట్టిన అన్నదాత పోరు పోస్టర్లను సోమవారం పుత్తూరు మండల అర్బన్, రూరల్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. నగరిలో మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



పుత్తూరు టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపాళెంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. రాచపాళెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, శంకరయ్య, కన్నమ్మ, రజని, రమాప్రభ, రేవతి హాజరయ్యారు. సీఆర్పీ ప్రధానోపాధ్యాయులు ఆర్.మంగపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటరామయ్య ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయురాలు ఎస్.గీత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'అమర'లో ఫిజియోథెరపీ సీఎంఈ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్లు

రేణిగుంట సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్సల అనంతరం ఫిజియోథెరపీ ప్రాధాన్యం, రోగులు త్వరగా కోలుకునే మార్గాలను వక్తలు వివరించారు. మండలంలోని కరకంబాడీలో ఉన్న అమర హాస్పిటల్‌లో వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా 'హెల్దీ ఏజింగ్ అండ్ ది రోల్ ఆఫ్ ఫిజియోథెరపీ' అంశంపై కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన ఫిజియోథెరపిస్టులు పాల్గొని క్లినికల్ లెర్నింగ్, ప్రొఫెషనల్ ఇంటరాక్షన్‌కు వేదికగా మార్చారు. ముఖ్య అతిథులుగా ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి, ఎస్వీ మెడికల్ కాలేజ్ బయోకెమిస్ట్రీ విభాగాధిపతి, ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ కౌన్సిల్ మాజీ సభ్యురాలు డాక్టర్ మాధవీలత, ప్రాంతీయ రవాణా అధికారి మురళిమోహన్ తదితరులు ఫిజియోథెరపీపై ప్రసంగించారు. ఈ సందర్భంగా రోబోటిక్ మోకాలు, హిప్ శస్త్రచికిత్సలపై సాంకేతిక శిబిరాన్ని నిర్వహించారు. అమర హాస్పిటల్ ఫిజియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ బిందుప్రియ, ఆర్థోపెడిక్స్ జాయింట్ రీప్లేస్‌మెంట్ కన్సల్టెంట్ సర్జన్ రవికుమార్ అధునాతన రోబోటిక్ టెక్నాలజీతో నిర్వహించే ఈ శస్త్రచికిత్సలలో ఫిజియోథెరపీకి ఉన్న ప్రాధాన్యాన్ని వివరించారు. ఏపీ స్టేట్ ఫిజియోథెరపీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతను నివారించండి: సీపీఐ



సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతను నివారించి రైతులకు సరిపడా సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం రైతులకు మద్దతుగా సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సంద్భంగా మురళి మాట్లాడుతూ... ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకుని వారి లైసెన్సులను రద్దు చేయాలన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య, మండల కార్యదర్శులు శివకుమార్, శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి గోపి, అయ్యప్ప, మురళి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యంత్ర పరికరాలు, విత్తనాలు, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఎరువుల డీలర్లు అధిక ధరలకు ఎరువులను పక్క రాష్ట్రాలకు తరలిస్తూ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధనుంజయశెట్టి, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, చంద్ర, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సీపీఎం నిరసన

సత్యవేడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డేకు మండల స్థాయి అధికారుల గైర్హాజరుపై సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ప్రతి గ్రీవెన్స్‌డే నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాలను మండలంలో అధికారులు బేఖాతరు చేస్తున్నారని మండిపడ్డారు. రెండు నెలలుగా ఎంపీడీవోతో పాటు ఒకరిద్దరు అధికారులు తప్ప మిగలిన వారు హాజరు కావడం లేదన్నారు. రమేష్, అరుణాచలం, మురళి, కృష్ణయ్య, వెంకటేష్, కాలనీవాసులు సుశీలమ్మ, కొల్లాపురి, లక్ష్మీ, గోవిందమ్మ, ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి



మంగమ్మ (ఫైల్ ఫొటో)

కేవీబీపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిద్దికండ్రిగకు చెందిన మంగమ్మ(44) సోమవారం పాముకాటుతో మృతి చెందింది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు... మిద్దికండ్రిగకు చెందిన మంగమ్మ సోమవారం ఉదయం సజ్జ పంట కోతకు వెళ్లింది. కంకులు కోస్తుండగా పొలంలో ఆమెను పాము కాటేసింది. సహచర కూలీలు ఆమెను ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తి ప్రభుత్వఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. దీంతో ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చ్యూరీకి పంపించారు.

గుండెపోటుతో బీజేపీ నాయకుడు...



వెంకటయ్య (ఫైల్ ఫొటో)

కేవీబీపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వెంకటయ్య(59) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తిరుపతి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, పార్టీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్ కాళంగికి చేరుకుని బీజేపీ జెండాను ఆయనపై కప్పి నివాళులర్పించారు. కూటమి నాయకులు రామాంజులు నాయుడు, గోపీనాథ రెడ్డి, సురేష్‌రెడ్డి, మునిశేఖర్‌యాదవ్, మునిసుబ్రహ్మణ్యం తదితరులు నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించండి

నాగలాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బకాయిలను వెంటనే చెల్లించాలని నాగలాపురం మండల వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు మురుగేశ్ డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు గత 12 వారాలుగా బిల్లులు చెల్లించలేదన్నారు. ఉపాధిహామీ చట్టం ప్రకారం 15 రోజుల్లోగా కూలి ఇవ్వని పక్షంలో చట్ట ప్రకారం అధికారులపై చర్యలు తీసుకునే వారన్నారు. ప్రస్తుతం 12 వారాలు గడుస్తున్నా బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. దినమణి, సుబ్బమ్మ, బాలాజీ, మునస్వామి, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీయించండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులగుంట ఎల్‌ఐసీ కాలనీగుండా మీదుగా వెళ్తున్న ఈదులగుంట కాలువలో పూడిక తీసి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా కోరారు. సోమవారం తొట్టంబేడు తహసీల్దారు భారతికి వినతిపత్రం అందజేశారు. పూడిక తీయకపోతే వర్షాకాలంలో కాలువ నిండి మురుగు ఎల్‌ఐసీ కాలనీ మీదుగా ప్రవహిస్తోందన్నారు. చిరంజీవి, నిజాముద్దీన్, పఠాన్ కరీముల్లా, వెంకటుమని, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు ఎస్టీయూ నాయకుల సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ జిల్లా ఉత్తమ ఎంఈవో అవార్డును కలెక్టర్ చేతులు మీదగా అందుకున్నందుకు ఎస్టీయూ నాయకులు సోమవారం ఎమ్మార్సీలో ఆయన్ను ఘనంగా సత్కారించారు. ఎంఈవో 2 మునిసుబ్రమణ్యం, ఎస్టీయూ నాయకులు రామచంద్రయ్య, సురేష్, వెంకటేశు, కులశేఖర్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కల్కి అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

హేతువాద సంఘం



ఎమ్మెల్యే బలరామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న నార్నే వెంకటసుబ్బయ్య

వరదయ్యపాళెం, సెప్టెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బత్తలవల్లం వద్ద ఉన్న కల్కి ట్రస్ట్ నిర్మించిన అక్రమ కట్టడాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ హేతు వాద సంఘం అధ్యక్షుడు నార్నే వెంకట సుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళగిరిలో జనసేన ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జనవాణిలో రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణకు వినతి అందించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కల్కి ట్రస్ట్ 21 ఎకరాల అటవీ భూములను ఆక్రమించిందన్నారు. హైడ్రా తరహాలో అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని కోరారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు

ఇన్‌చార్జి ఎంపీడీవోగా మోతి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి ఇన్‌చార్జి అధికారిగా కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న మోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో వెంకటరత్నమ్మ నెల రోజులు పాటు శిక్షణ నిమిత్తం వెళ్లడంతో మోతి బాధ్యతలు చేపట్టారు.

ఛటర్జీ నగర్‌లో అధ్వాన పారిశుధ్యం





మురుగునీటి కాలువలు పూడిపోవడమే కాకుండా అధ్వానంగా మారిన ఛటర్జీనగర్‌లోని రోడ్లు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచగున్నేరి పంచాయతీలో ఉన్న ఛటర్జీనగర్ కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఈ కాలనీలో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో వీధుల్లోనే మురుగు తిష్ట వేస్తోంది. అలాగే రోడ్లు కూడా అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడికి సమీపంలోనే భారీ పరిశ్రమలు ఉండటంతో వలస కార్మికులు అధికంగా నివసిస్తుంటారు. లోతట్టు కాలనీ కావడంతో చినుకు పడితే వీధులు జలమయం అవుతున్నాయి. అలాగే పందుల సంచారం అంతకంతకు పెరుగుతోంది. యేటా వర్షాకాలంలో దోమలు, దుర్గంధం, సీజనల్ వ్యాధులు కాలనీ ప్రజలను వెంటాడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఫౌండేషన్ పాఠశాలలో విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధచూపాలని ఎంఈవో 2 మునిసుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని గాజులపెళ్లూరు గిరిజన కాలనీలో పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, రికార్డులతో పాటు విద్యార్థుల హాజరును కూడా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల చదువులపై ఆరా తీశారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

కేవీబీపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవనూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీదేవి తన తండ్రి వీరాస్వామి వర్ధంతి సందర్భంగా విద్యాసామగ్రిని వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీప, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనం కోసమే ఎంబీకే యాప్

సత్యవేడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సంఘాల్లో పారదర్శకత, జవాబుదారీ తనం కోసమే మొబైల్ బుక్ కీపింగ్ (ఎంబీకే) 2.ఓను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ తెలిపారు. వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు యాప్‌పై అవగాహన కల్పించారు. డ్వాక్రా సంఘాల లావాదేవీలను ఎంబీకే యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.ఎంపీడీవో త్రివిక్రమరావు, స్టేట్ బ్యాంక్ మేనేజర్ సూర్యప్రకాష్, వెలుగు కోఆ ర్డినేటర్లు శివకుమార్, మధుసూదన్, పురు షోత్తం, పుల్లయ్య, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరానికి స్పందన



ఆధార్ నమోదు కోసం హాజరైన గిరిజనులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళచ్చూరు సచివాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. కలెక్టర్ ఆదేశాలతో గ్రామ సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండల, విద్యాశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రగతి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఆధార్‌కార్డు లేని పాఠశాల విద్యార్థులను, గ్రామస్తులను గుర్తించారు. మాన్‌డేటరి బయోమెట్రిక్ అప్‌డేట్, డమిసైల్ బర్త్ సర్టిఫికెట్ ద్వారా ఆధార్ నమోదు చేశారు. కొంతమంది గిరిజనులకు ఆధార్‌కార్డు లేకపోవడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ శిబిరాలను నిర్వహించేందుకు కృషి చేశారు. ఈ వారంలో ఎంపిక చేసిన సచివాలయాల్లో గిరిజనులు ఆధార్ నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, పవిత్ర, బ్రాహ్మణపల్లి మహిళా పోలీసు హేమావతి, ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, రామచంద్రయ్య, గిరిజన సంక్షేమ శాఖ కోఆర్డినేటర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం సుభిక్షం

ఏర్పేడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు అన్నారు. మండలంలో రెండు రోజులుగా మాజీ ఎమ్మెల్యే మధు సూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంపై నాగరాజు నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా ప్రజలకు అందిస్తోంద న్నారు. రెండురోజులుగా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణప్ప మొదలియార్, మనోహర్‌నాయుడు, సురేష్ నాయుడు, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటలతో పౌష్టికాహారం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి పెరటి తోటలను సేంద్రియ ఎరువులతో పండిస్తే మంచి పౌష్టికాహారం అందుతుందని వెలుగు ఏపీఎం మునెయ్య తెలిపారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తానగల్లులో మహిళా సంఘాలు తమ ఇంటి పెరటిలో పెంచుతున్న తోటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి దగ్గర ఖాళీ స్థలంలో పెరటి తోటలలో ఆకు కూరలు, కూరగాయలను పండించాలన్నారు. వీటిని మహిళ సంఘాల సభ్యులకు విక్రయించాలన్నారు. సీసీలు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకే సీఎం సహాయ నిధి



చెక్కులను పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి

సత్యవేడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యాధులతో బాధపడుతున్న పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకే సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్నామని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు శంకర్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఏఎంపురానికి చెందిన వరలక్ష్మికి రూ. 93,390, దళవాయి అగ్రహారానికి చెందిన చెంగల్రాయన్‌కు రూ.42,276, శిరుణంబూదూరులో ప్రమాదంలో మృతి చెందిన యువరాజ్ కుటుంబానికి రూ.65,104 చెక్కులను అందించారు. కార్యక్రమంలో సర్పంచులు జడేరి బాబు, రవిరెడ్డి, రూబెన్, సత్యవేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు హేమభూషణం, దనేష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, షణ్ముగం, రాదయ్య, చికెన్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ఏర్పేడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రోజువారీ ఆదాయం పొందాలంటే రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని రాస్ మహిళా భారతి పీడీ బాలాజీ రెడ్డి సూచించారు. మండలంలోని పాపానాయుడుపేటలో రాస్ కృషి విజ్ఞానకేంద్రం, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో రైతు రుణా మేళాను నిర్వహించారు. కేవీకే పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ డి.అనూష మాట్లాడుతూ... దూడ దశ నుంచి గర్భాధారణ, పాలిచ్చే వరకు అనుసరించాల్సిన పద్ధతులు, డీవార్మింగ్, అజొల్లా సాగు విధానాలు, మట్టి పరీక్షలను వివరించారు. 97మంది రైతులకు రూ.48లక్షల రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేదాచలం, మునిపార్థసారథి, మునీంద్ర, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేను వేగవంతం చేయండి



సర్వేయర్‌కు దిశానిర్దేశం చేస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్రిపాడు, చల్లమాంబపురం, తంగేళ్లపురం, నీర్పాకోట, పీఎస్‌పురం, కంచన పుత్తూరు, కనమనంబేడు, బీఎస్‌పురంలలో జరుగుతున్న రీ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీదేవి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సచివాలయ సర్వేయర్‌తో ఆమె సమీక్షించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా రెండో విడత సర్వే చేపట్టిందన్నారు. రైతులు సమక్షంలో సర్వే చేయాలన్నారు. కుమార వెంకటాపురంలో రీసర్వే పూర్తయ్యిందన్నారు.

గురువులను గౌరవించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాగలాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గురువులను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం మండల విద్యాశాఖ అధికారి బాబయ్య, జనార్దన రాజు నేతృత్వంలో స్థానిక వ్యాపార సంఘం కల్యాణ మండపంలో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ... అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞాన కాంతులను నింపేవారే ఉపాధ్యాయులన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు. కస్తూరయ్య, వెంకటేశ్వరులు, వాసు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో టీఎంసీ కమిషనర్



ఏర్పేడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలెపి గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామిని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పౌష్టికాహారం పంపిణీ



ఆపిల్ పండ్లతో విద్యార్థులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ప్యానల్ పరిశ్రమ సహకారంతో సోమవారం గ్రీన్‌ప్యానెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరురోజులు రోజుకు ఒక పండును విద్యార్థలకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు లోగనాథ జయరాం, బాలసుధీర్, మణికంఠ, అన్నమృత ఫౌండేషన్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.